Follow: @ANNTELUGU
ANN తెలుగు
25-02-2025
# మహా పత్రిక
మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 85 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## అది సూపర్ ఫుడ్
### ఏడాదిలో 300 రోజులు తీసుకుంటా..
### మఖానాపై ప్రధాని మోదీ

**మహా:** మఖానా సూపర్ ఫుడ్ అని, అది ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనకారి అని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. 365 రోజుల్లో 300 రోజులు అది తన ఆహారంలో భాగమయ్యేలా చూసుకుంటానని వెల్లడించారు. దేశవ్యాప్తంగా ఉన్న చాలామంది ప్రజలకు అల్పాహారంలో మఖానా ఉంటుందని, అంతర్జాతీయ స్థాయిలో దాని ఉత్పత్తి ఉండాలని పేర్కొన్నారు. సోమవారం బీహార్‌లోని భాగల్‌పుర్‌లో పర్యటించిన సందర్భంగా.. తన ఆహారపు అలవాటు గురించి చెప్పారు. 'రైతుల శ్రేయస్సు కోసం బిహార్‌లో మఖానా బోర్డు ఏర్పాటు చేయనున్నట్లు వార్షిక బడ్జెట్‌లో నిర్మలాసీతారామన్ ప్రకటించిన నేపథ్యంలో దీనికి గుర్తుగా భాగల్‌పుర్ కార్యక్రమంలో మోదీకి మఖానాతో చేసిన దండను వేసి గౌరవించారు.

**టాప్ న్యూస్**

### 11 మందితో వెళ్లింది.. 11 నిమిషాలు ఉండేందుకా?
- అటెండెన్స్ కోసం వచ్చారా?
- జగన్‌పై షర్మిల ఫైర్



02

### రష్యా అల్లుడికి జర్మనీ గురించి బాగా తెలుసనుకుంటా
- ప్రతిపక్ష హోదా అడుగుతుంటే పవన్ కళ్యాణ్ వంకరగా మాట్లాడుతున్నారు
- మాజీ మంత్రి ఆర్ కే రోజా



03

### కోహ్లీ కన్నా కేసీఆర్‌దే పెద్ద రికార్డు
- మాజీ సీఎంపై కొండా సురేఖ సెటైరికల్ ట్వీట్
- సర్వత్రా హాట్ టాపిక్



03





# కేసీఆర్, కేటీఆర్‌కు బీజేపీనే రక్ష

### బండిసంజయ్.. దమ్ముంటే ఆ ఇద్దరినీ అప్పగించండి

- 48 గంటల్లో బొక్కలో వేసి లెక్కలు తేలుస్తాం
- గొర్రెల స్కాం, కార్ల స్కాం ఫైళ్ళు ఈడి తీసుకెళ్ళి అరెస్ట్ చేయట్లేదు
- ఢిల్లీలో బీఆర్ఎస్ నేతలతో బేరం చేసుకున్నారు
- 8 మంది ఎంపీలను గెలిపిస్తే కిషన్ రెడ్డి, బండికి మాత్రమే ఉద్యోగాలు
- కిషన్‌రెడ్డి, ఈటల కలిసి రాష్ట్రం అభివృద్ధి కాకుండా కుట్రలు చేస్తున్నారు
- కిషన్ రెడ్డి దమ్ముంటే మెట్రోకు, మూసీకి అనుమతులివ్వు
- ట్రిపుల్ ఆర్ కు అడ్డుపడే టాస్క్ ఈటల తీసుకున్నారు
- హైటెక్ సిటీ కట్టింది మేమే. ఫ్యూచర్ సిటీ కట్టేది కూడా మేమే
- కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని గెలిపిస్తేనే ఉపయోగం
- పట్టభద్రుల సమ్మేళనాల్లో సీఎం రేవంత్ రెడ్డి

**మంచిర్యాల, నిజామాబాద్, కరీంనగర్, మహా :** తెలంగాణలో 8 మంది భాజపా ఎంపీలను గెలిపిస్తే కేంద్రం నుంచి వారు సాధించిందేమీలేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం ఏర్పడ్డాక 55వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంచిర్యాలతో పాటు నిజామాబాద్, కరీంనగర్ సభల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పిసిసి చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు. పట్టభద్రులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో సీఎం మాట్లాడారు. "11 ఏళ్ల మోదీ పాలనలో రాష్ట్రానికి ఏం చేశారు? ఎంతమంది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చారు? 2014, 2019 ఎన్నికల ప్రచారంలో ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రధాని చెప్పారు. ఆ లెక్కన 24 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాలి. తెలంగాణలో రెండు ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారు. ఒకటి కిషన్‌రెడ్డికి.. మరొకటి బండి సంజయ్‌కు. వీరికి కాకుండా ఇంకెవరికైనా ఇచ్చారా? ఇన్ని వేలమందికి ఉద్యోగాలు ఇవ్వని భాజపాకు ఓటు అడిగే హక్కు ఎక్కడిది? మా ప్రభుత్వం వచ్చాక మొత్తం 55,163 మందికి ఎల్బీ స్టేడియంలో ఉద్యోగ నియామకపత్రాలు అందజేశాం. డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వడంతో పాటు టెట్ నిర్వహించాం. 11 వేల మంది టీచర్ల నియామకం చేపట్టాం. పోలీసుశాఖలో 15 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చాం. 6వేలకు పైగా పారామెడికల్ సిబ్బందిని నియమించాం.

మిగతా 3లో



## కంది శ్రీనివాసరెడ్డి ఫోన్‌లో ప్రజంటేషన్
### ఆసక్తిగా తిలకించిన సీఎం రేవంత్

**మంచిర్యాల:** మంచిర్యాలలో సీఎం రేవంత్ రెడ్డి ని ఆదిలాబాద్ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి కలిశారు. ఆదిలాబాద్ లో స్థానిక పరిస్థితులు సీఎం తెలుసుకున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం గురించి , ఆదిలాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన విషయాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా కంది శ్రీనివాస రెడ్డి ఫోన్ లో ప్రత్యేక ప్రజెంటేషన్ సీఎం రేవంత్ రెడ్డి , టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చూసి అభినందించారు. మంచిగా పనిచేయాలని, ఆదిలాబాద్ ను అన్ని విధాలుగా అభివృద్ధి చేద్దామని అన్నారు.



## రేవంత్ విజన్ ఉన్న నాయకుడు
### పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

**మహా, హైదరాబాద్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజన్ ఉన్న నాయకుడని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. నిజామాబాద్‌లో సోమవారం కాంగ్రెస్ పట్టభద్రుల ఆత్మీయ సమేళనం జరిగింది.

మిగతా 3లో



## ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లను రోడ్డున పడేస్తారా?
### సీఎం రేవంత్‌కు కిషన్‌రెడ్డి బహిరంగ లేఖ

**హైదరాబాద్:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి బహిరంగ లేఖ రాశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 14 నెలల పాలనపై కిషన్‌కెడ్డి లేఖ రాశారు.

మిగతా 3లో



## టన్నెల్ ప్రమాదంపై అనుమానాలు ఉన్నాయి
### మాజీమంత్రి హరీశ్ రావు

- ఘటన జరిగి మూడు రోజులైనా సీఎం రేవంత్ రెడ్డి అక్కడికి వెళ్లలేదు
- హెలికాప్టర్ వేసుకుని మూడు జిల్లాల్లో ఎన్నికల ప్రచారానికి వెళ్లారు

వివరాలు 2లో



## మహాకుంభమేళాలో నటి కత్రినాకైఫ్

**మహా:** ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభమేళా వైభవంగా కొనసాగుతోంది. కుంభమేళాలో బాలీవుడ్ నటి కత్రినాకైఫ్ తన కుటుంబసభ్యులతో కలిసి పుణ్యస్నానం ఆచరించారు. ఈ సందర్భంగా భక్తులు ఆమెను చూసేందుకు, సెల్ఫీలు దిగేందుకు ఎగబడ్డారు.

## దమ్ముంటే బీఆర్ఎస్ స్కాంలన్నీ సీబీఐకి అప్పగించండి

- దోషులందరినీ బొక్కలో వేస్తాం
- రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి బండి సంజయ్

**మహా :** ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రసంగమంతా పచ్చి అబద్దాలు, అర్ధ సత్యాలతో నిండిపోయిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి ఓటమి ఖాయమనే భయం ఆయనలో స్పష్టంగా కన్పిస్తోందన్నారు. ఇంటెలిజెన్స్ సహా అన్ని సర్వే సంస్థలన్నీ బీజేపీ గెలుపు తథ్యమని తేల్చేశాయని, కాంగ్రెస్ 3వ స్థానానికి పడిపోతుందని నివేదికలివ్వడంతో దిక్కుతోచని ముఖ్యమంత్రి

మిగతా 2లో



## మోగిన మరో ఎన్నికల నగారా
### ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు షెడ్యూల్

**తెలంగాణలో ఐదు, ఏపీలో ఐదు ఖాళీలు**

**మార్చి 3న నోటిఫికేషన్..10 వరకు నామినేషన్లు.. మార్చి 20న పోలింగ్**

**సంఖ్యా బలం ఆధారంగా కాంగ్రెస్ కు 4, బిఆర్ఎస్ కు 1**

**ఆశావహులు 20 మందికి పైనే**

**హైదరాబాద్, మహా :** తెలంగాణలో మరో ఎన్నికల నగరా మోగింది. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. తెలంగాణలో మొత్తం 5 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. మార్చి 3న ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కానుండగా మార్చి 10 వరకు నామినేషన్లకు తుది గడువు ఇచ్చారు. మార్చి 20న పోలింగ్ జరగనుంది. అదే రోజు ఫలితాలు కూడా వెల్లడి కానున్నాయి.

మిగతా 2లో




## ఎస్ఎల్ బీసీ టన్నెల్ ప్రమాదం


- రంగంలోకి ర్యాట్ హోల్ మైనర్లు
- ప్రమాదం జరిగి 72 గంటలైనా ఆచూకి తెలియని 8 మంది



02

## వారణాసిలో రోడ్డు ప్రమాదం

- సంగారెడ్డికి చెందిన ముగ్గురు మృతి
- కుంభమేళా నుంచి తిరిగి వస్తుండగా ప్రమాదం
- సంతాపం తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి



02

## పొలాల్లోకి కలెక్టర్.. రైతుకు భరోసాగా

- ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పనితీరుకు ప్రశంసలు
- ఆయకట్టు రైతుకు నీరు, యూరియాపై అభయం



02

# టీడీపీకి బిగ్ షాక్..

## గుడ్ బై చెప్పిన జీవీ రెడ్డి



**విజయవాడ, మహా:** ఏపీ స్టేట్ ఫైబర్ నెట్ లిమిటెడ్ చైర్మన్ గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి జీవీ రెడ్డి రాజకీయాల నుండి తప్పుకుంటున్నట్లు ప్రకటన విడుదల చేశారు. భవిష్యత్తులో తాను ఏ రాజకీయ పార్టీలో చేరే ఉద్దేశం లేదంటూ కూడా జీవీ రెడ్డి విడుదల చేసిన ప్రకటన ద్వారా వెల్లడించడం విశేషం. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే టీడీపీ జాతీయ అధికారి ప్రతినిధి జీవీ రెడ్డికి ఏపీ స్టేట్ ఫైబర్ నెట్ లిమిటెడ్ చైర్మన్ గా ప్రభుత్వం నియమించింది. దీనితో ఏపీ ఫైబర్ నెట్ కు సంబంధించి వైసీపీ ప్రభుత్వ హయాంలో అవినీతి జరిగిందంటూ జీవి రెడ్డి పలుమార్లు సంచలన ఆరోపణలు చేశారు. అలాగే ఫైబర్ నెట్ లో సుమారు 400 మందికి పైగా ఉద్యోగులను తొలగించారు. వైసీపీ కార్యకర్తలకు ఏపీ ఫైబర్ నెట్ లో ఉద్యోగాలు కల్పించారని పలుమార్లు జీవి రెడ్డి ఆరోపించారు. ఈ దశలో ఏపీ స్టేట్ ఫైబర్ నెట్ ఎండీ దినేష్ కుమార్ కు చైర్మన్ జీవి రెడ్డికి పలు విషయాలలో విభేదాలు వచ్చినట్లు సమాచారం. ఈ కారణంగానే జీవి రెడ్డి గత కొద్ది రోజులుగా అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. కాగా సోమవారం కూటమి ప్రభుత్వానికి ఊహించని షాక్ ను జీవి రెడ్డి ఇచ్చారని చెప్పవచ్చు. వ్యక్తిగత కారణాలతో తాను తెలుగుదేశం పార్టీ ప్రాథమిక సభ్యత్వం, జాతీయ అధికార ప్రతినిధి హోదాకు, అలాగే ఏపీ స్టేట్ ఫైబర్ నెట్ లిమిటెడ్ చైర్మన్ పదవుల నుండి తప్పుకుంటున్నట్లు జీవీ రెడ్డి ప్రకటించారు. తనపై ఉంచిన విశ్వాసానికి, అందించిన మద్దతుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు, తెలుగుదేశం పార్టీ మరింత బలంగా ఎదిగి ప్రజాసేవలో ముందుండాలని జీవీ రెడ్డి తన రాజీనామా ప్రకటనలో పేర్కొన్నారు. అయితే ఇకపై తాను పూర్తిగా న్యాయవాద వృత్తిలో కొనసాగుతానని, భవిష్యత్తులో ఎటువంటి రాజకీయ పార్టీలో చేరే ఉద్దేశం లేదంటూ జీవి రెడ్డి తేల్చి చెప్పారు. అధికారులను వెనకేసుకువచ్చే పద్ధతిని బాబు మానుకోలేదని, టిడిపికి ఇది పెద్దషాకేనని విశ్లేషకులు భావిస్తున్నారు.

# దమ్ముంటే బీఆర్ఎస్ స్కాంలన్నీ సీబీఐకి అప్పగించండి

## దోషులందరినీ బొక్కలో వేస్తాం.. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి బండి సంజయ్



(మొదటిపేజీ తరువాయి)

హడావుడిగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి వచ్చి ఒకే రోజు 3 జిల్లాల్లో 3 మీటింగ్ ల్లో పాల్గొంటూ అబద్ధాలాడుతూ, ఓటర్లను బ్లాక్ మెయిల్ చేసేలా మాట్లాడుతూ బెదిరింపులకు పాల్పడుతున్నారని మండిరపడ్డారు. గెలిచినా ఓడినా ప్రభుత్వానికి ఢోకా లేదు, నాకేం ఫరఖ్ లేదని బుకాయిస్తున్నాడంటూ అంత ధీమా ఉంటే ఎన్నికల ప్రచారానికి ఎందుకు వచ్చినట్లు? చరిత్రలో ఇంతవరకు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఏ ముఖ్యమంత్రి కూడా పాల్గొన్న దాఖలాల్లేవన్నారు. ఓటమి భయం పట్టుకుంది కాబట్టే ఎన్నికల్లో పాల్గొంటూ డబ్బు, అధికార బలంతో ఎలాగైనా గెలవాలని చూస్తున్నారన్నారు. దీనికితోడు ఓడిపోతే మీ సమస్యలను పరిష్కరించబోనంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని విరుచుకుపడ్డారు.

ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా ఈ రేస్, గొర్రెల స్కాంలపై సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు చూస్తే ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నారా? లేక మేము ఉన్నామా? అనే అనుమానం వస్తోందన్నారు. లా అండ్ ఆర్డర్ రాష్ట్రం పరిధిలోనిదని, కేసీఆర్ కుటుంబం, బీఆర్ఎస్ నేతలు స్కాంలు చేసింది రాష్ట్రంలోనే అని పేర్కొన్నారు. దొచుకున్న సొమ్మంతా తెలంగాణ ప్రజలదేనని, విచారణ చేస్తున్నది రాష్ట్ర ప్రభుత్వమే అంటూ కొంత మంది నిందితులను అరెస్ట్ చేసింది కూడా రాష్ట్ర ప్రభుత్వమేనని గుర్తు చేశారు. లా అండ్ ఆర్డర్ రాష్ట్రం చేతిలో ఉంటే మీరేందుకు అరెస్ట్ చేయలేదని కేంద్రాన్ని నిందించడం చూస్తుంటే నవ్వొస్తుందన్నారు. ప్రభాకర్ రావు, శ్రవణ్ విదేశాలకు పోతే కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు సహా ఆయా స్కాంల సూత్రధారులు తెలంగాణలోనే ఉన్నారు కదా? మరి వాళ్లను ఇన్నాళ్లుగా ఎందుకు అరెస్ట్ చేయలేదని సంజయ్ నిలదీశారు. అన్ని ఆధారాలున్నాయని చెబుతూ రాధాకిషన్ రావు సహా కొందరు అధికారులను అరెస్ట్ చేసి 10 నెలలకుపైగా జైల్లో ఉంచిన మీరు కేసీఆర్ కుటుంబాన్ని ఎందుకు అరెస్ట్ చేయలేదని నిలదీశారు. పైకి తిడుతున్నట్లుగా ఉంటూ నటిస్తూ కేసీఆర్ కుటుంబంతో చీకటి ఒప్పందాలు చేసుకుంటూ అరెస్ట్ కాకుండా కాపాడుతూ ఆయా కేసులను నీరుగారుస్తున్నది మీరు కాదా? మీకు నిజంగా నిజాయితీ ఉంటే ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా ఈ రేస్, గొర్రెల స్కాం, కాళేశ్వరం, కేటీఆర్ బామ్మర్ది డ్రగ్స్ వ్యవహారంపై సీబీఐ విచారణ జరపాలని లేఖ రాయండని సంజయ్ డిమాండ్ చేశారు. ఆయా కేసుల్లో దోషులెవరైనా అరెస్ట్ చేసి బొక్కలో వేయించే బాధ్యత కేంద్రం తీసుకుంటుందని, రాష్ట్ర ప్రభుత్వం కోరకుండా న్యాయస్థానాల ఆదేశాలు లేకుండా సీబీఐ తనంతట తాను విచారణ జరిపే అధికారం లేదని తెలిసి ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి కేంద్రంపై బురద చల్లడం ఆయన దివాళాకోరుతనానికి నిదర్శనమని సంజయ్ విరుచుకుపడ్డారు.

బీసీ రిజర్వేషన్ల విషయంలోనూ ముఖ్యమంత్రి అర్ధ సత్యాలు, అబద్దాలతోనే ప్రజలను మభ్యపెడుతున్నారని సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమగ్ర కుటుంబ సర్వేలో బీసీల జనాభా 51 శాతం ఉందని, ఆ సంఖ్యను 46 శాతానికి ఎట్లా తగ్గిస్తారని అసెంబ్లీ సాక్షిగా నాటి ప్రభుత్వంలో మంత్రులుగా ఉన్న కేటీఆర్, హరీష్ రావులే చెప్పారని, మరి ఆనాడెందుకు ముస్లిం జనాభా గురించి సీఎం నిలదీయలేదు? రాష్ట్రంలో ఉన్న ముస్లింల్లో 80 శాతం మందిని బీసీ జాబితాలో చేర్చి రిజర్వేషన్లు అమలు చేసి నిజమైన బీసీ బిడ్డల పొట్టకొడుతుంటే చూస్తూ ఊరుకోవాలా? బరాబర్ మతపరమైన రిజర్వేషన్లను వ్యతిరేకిస్తాం. బీసీ జాబితా నుండి ముస్లింలను తొలగించి బీసీ బిల్లు పంపితే కేంద్రాన్ని ఒప్పించే బాధ్యత మేం తీసుకుంటామని సంజయ్ స్పష్టం చేశారు.


# వారణాసిలో రోడ్డు ప్రమాదం

## సంగారెడ్డికి చెందిన ముగ్గురు మృతి

### కుంభమేళా నుంచి తిరిగి వస్తుండగా ప్రమాదం

### సంతాపం తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి





**మహా :** ఉత్తరప్రదేశ్ వారణాసి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రమాదంలో సంగారెడ్డి జిల్లాకు చెందిన ముగ్గురు మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో జహీరాబాద్ నీటి పారుదల శాఖ డీఈ వెంకటరామిరెడ్డి (46), ఆయన భార్య విలాసిని (40), మల్గికి చెందిన కారు డ్రైవర్ మల్లారెడ్డి (42) ఉన్నారు. ద్విచక్ర వాహనాన్ని తప్పించే క్రమంలో రోడ్డు పక్కన నిల్చున్న టిప్పర్ వాహనాన్ని కారు ఢీకొట్టడంతో వెంకటరామిరెడ్డి, విలాసిని, డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన మరో ముగ్గురిని సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతులు వెంకటరామిరెడ్డి స్వస్థలం న్యాల్ కల్ మండలం మామిడిగి కాగా, సంగారెడ్డిలో స్థిర నివాసం ఉంటున్నారు. వారణాసిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సంగారెడ్డి జిల్లా వాసులు మృతి చెందడం పట్ల సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన చికిత్స, తక్షణ సహాయక చర్యలను అందించేందుకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ అధికారులతో మాట్లాడాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు. వీలైనంత తొందరగా త దేహాలను స్వస్థలాలకు రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగాన్ని సీఎం ఆదేశించారు.

# టన్నెల్ ప్రమాదంపై అనుమానాలు ఉన్నాయి

## మాజీమంత్రి హరీశ్ రావు

### ఘటన జరిగి మూడు రోజులైనా సీఎం రేవంత్ రెడ్డి అక్కడికి వెళ్లలేదు

### హెలికాప్టర్ వేసుకుని మూడు జిల్లాల్లో ఎన్నికల ప్రచారానికి వెళ్లారు





**మహా :** ఎస్ఎల్ బీసీ టన్నెల్ లో జరిగిన ప్రమాదం దురదృష్టకరమని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. టన్నెల్ ప్రమాదంపై అనేక అనుమానాలు ఉన్నాయని, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందన్నారు. రెస్క్యూ ఆపరేషన్ లో ప్రభుత్వ చిత్తశుద్ధి కనిపించడం లేదని హరీశ్ రావు విమర్శించారు. ప్రమాదం జరిగినా సీఎం రేవంత్ రెడ్డి సంఘటనా స్థలానికి వెళ్లకుండా ఎన్నికల ప్రచారం చేస్తున్నారని హరీశ్ రావు ధ్వజమెత్తారు. ఈ సంఘటన చాలా దురదృష్టకరం. 8 మంది కార్మికులు ఏమయ్యారో తెలియకపోవడం చాలా ఆందోళనకు గురి చేస్తోంది. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఆ 8 మంది బతికి ప్రాణాలతో బయటకు రావాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నా. బాధ కలిగే అంశం ఏంటంటే.. ఈ ప్రభుత్వానికి 8 మంది ప్రాణాల కంటే ఎన్నికల ప్రచారం ముఖ్యమైపోయిందన్నారు. సంఘటన జరిగి మూడు రోజులైనా సీఎం రేవంత్ రెడ్డి అక్కడికి వెళ్లలేదని, హెలికాప్టర్ వేసుకుని మూడు జిల్లాల్లో ఎన్నికల ప్రచారానికి వెళ్లారని మండిపడ్డారు. నిన్న హెలికాప్టర్ ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి టన్నెల్ దగ్గరికి వెళ్లారు, ఇవాళ హెలికాప్టర్ లేదని ఇంట్లో కూర్చున్నారు, ఇదేనా పద్ధతి అని నిలదీశారు. నీటి పారుదల శాఖ మంత్రి పోడు, ముఖ్యమంత్రి ఏమో ఇప్పటి వరకు అక్కడికి పోలేదు, ఎన్నికల ప్రచారానికి తిరుగుతున్నారన్నారు. ప్రాధాన్యత ఏంటి అని అడుగుతున్నా ఇది చాలా బాధ కలిగిస్తోందన్నారు.

మేము ప్రధాన ప్రతిపక్షంగా మా వాళ్లంతా అక్కడికి వెళ్దామని అనుకున్నాం కానీ, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, మిలటరీ అక్కడ పని చేస్తున్నాయి, మేము అక్కడికి వెళ్లడం ద్వారా అక్కడ సాంకేతికంగా ఇబ్బంది కావొద్దని, సహాయక చర్యల్లో ఎక్కడా ఆటంకం కలగొద్దు అనే ఉద్దేశంతో ప్రధాన ప్రతిపక్షంగా మేము కోఆపరేట్ చేస్తున్నామన్నారు. మరోవైపు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావులు అక్కడ కూర్చుని రాజకీయాలు మాట్లాడటం దారుణమన్నారుయ. గత పదేళ్లు బీఆర్ఎస్ ప్రభుత్వం ఏమీ పని చేయలేదు, అందువల్లే మేము ముట్టుకోగానే ఇది కూలిపోయిందని అంటున్నారు, ఇంతకన్నా బుద్ధి తక్కువ మాటలు ఇంకేమైనా ఉంటాయా? చదువుకున్న వ్యక్తివి, కెప్టెన్ వి.. ఏది పడితే అది మాట్లాడితే ఎలా? ఆచితూచి మాట్లాడాలి, అవీ నిజాలు మాట్లాడాలని హరీష్ రావు ధ్వజమెత్తారు.

అనుకోకుండా కాళేశ్వరంలో జరిగితే అది లక్ష కోట్ల అవినీతి అయ్యిందన్నారు. కాళేశ్వరం మొత్తం కూలిపోయింది, అవినీతిమయమైపోయిందని రాహుల్ గాంధీ నుంచి ఉత్తమ్, రేవంత్ దాకా మాట్లాడారు. మరిప్పుడు జరిగిందేంటి? కాంగ్రెస్ కో నీతి? మాకో నీతి ఉంటుందా? అని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ అంటే మూడు బ్యారేజీలు, 15 రిజర్వాయర్లు, 19 పంప్ హౌస్ లు, 21 సబ్ స్టేషన్లు, 1531 కిలోమీటర్ల గ్రావిటీ కెనాల్, 203 కిలోమీటర్ల టన్నెల్, 98 కిలోమీటర్ల ప్రెజర్ మెయిన్స్, 530 మీటర్ల ఎత్తు లిఫ్ట్ లు, 141 టీఎంసీల నిల్వ సామర్థ్యం.. ఇంత పెద్ద కాళేశ్వరంలో అన్నీ బాగున్నాయి. మూడు బ్యారేజీలలో ఒక బ్యారేజీలో 7 బ్లాకుల్లో ఒక బ్లాక్ లో ఒక పిల్లర్ కూలింది అంతే అని హరీష్ రావు తెలిపారు. దానికి మొత్తం కాళేశ్వరం కూలిపోయిందని రాజకీయం చేశారు. కాంగ్రెస్ వాళ్లు మా మీద అబద్దాలు చెప్పి ఎన్నికల్లో లబ్ది పొందే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. కాళేశ్వరం కూలిపోతేనేమో బీఆర్ఎస్ తప్పు, బీఆర్ఎస్ అవినీతి, ఎస్ఎల్ బీసీ టన్నెల్ కూలిపోతేనేమో ఇందులో మనుషుల తప్పేమీ లేదు ప్రకృతి వైపరిత్యం, కామన్ గా జరుగుతుంటాయి అని ఉత్తమ్ అంటున్నారని హరీష్ రావు నిప్పులు చెరిగారు.



### 11 మందితో వెళ్లింది..

# 11 నిమిషాలు ఉండేందుకా?

## జగన్‌పై షర్మిల ఫైర్

**విజయవాడ, మహా :** ప్రజా సమస్యల కన్నా మీకు ప్రతిపక్ష హోదానే ముఖ్యమా? అని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. నేడు అసెంబ్లీకి వచ్చింది 11 మంది ఎమ్మెల్యేలతో కలిసి 11 నిమిషాలు ఉండేందుకా? అని జగన్ ను నిలదీశారు. ఈ మేరకు 'ఎక్స్'లో ఆమె పోస్ట్ చేశారు. "ప్రజా సమస్యల కన్నా మీకు ప్రతిపక్ష హోదానే ముఖ్యమా? సభ్యత్వాలు రద్దవుతాయనే భయంతో అటెండెన్స్ కోసం వచ్చారా? కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించడానికి మీకు ప్రతిపక్ష హోదానే కావాలా? ప్రజల శ్రేయస్సు కంటే.. మీకు పదవులే ముఖ్యమని అసెంబ్లీ సాక్షిగా నిరూపించుకున్నారు. వైకాపా సభ్యులకు పదవులు ముఖ్యం కాదు అనుకుంటే.. ప్రజాసమస్యల మీద చిత్తశుద్ధి ఉంటే మంగళవారం నుంచి అసెంబ్లీకి వెళ్లాలి. సభకు వెళ్లే దమ్ము లేకపోతే తక్షణం పదవులకు రాజీనామాలు చేయాలని మరోసారి డిమాండ్ చేస్తున్నాం" అని షర్మిల పేర్కొన్నారు.

# ఎస్ఎల్ బీసీ టన్నెల్ ప్రమాదం

## రంగంలోకి ర్యాట్ హోల్ మైనర్లు

### ప్రమాదం జరిగి 72 గంటలైనా ఆచూకి తెలియని 8 మంది



**మహా :** మహబూబ్ నగర్ జిల్లా శ్రీశైలం లెఫ్ట్ కెనాల్ టన్నెల్ కుప్పకూలిన ఘోర ఘటనలో 8 మంది కార్మికులు సొరంగంలోనే చిక్కుకుపోయిన విషయం తెలిసిందే. ఈ ఘటన జరిగి 72 గంటలు దాటినా ఇప్పటి వరకు సొరంగంలో చిక్కుకున్న వారి ఆచూకీ దొరకడం లేదు. సొరంగంలో చిక్కుకున్న కార్మికులను బయటకు తీసుకురావడానికి ఎన్ డి ఆర్ఎఫ్, ఎస్ డీఆర్ఎఫ్, ఆర్మీ , సింగరేణి బృందాలు ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితం కనిపించడం లేదు. దీంతో ఇప్పుడు ర్యాట్ హోల్ మైనర్లు రంగంలోకి దిగారు. ఢిల్లీ నుంచి ప్రత్యేకంగా వచ్చిన ఆరుగురు ర్యాట్ హోల్ మైనర్లు టన్నెల్లో చిక్కుకున్న ఎనిమిది మంది కార్మికులను బయటకు తీసుకురావడానికి ప్రయత్నం చేస్తున్నారు. ఈ టీం 2023లో ఉత్తరకాశి సొరంగం దుర్ఘటన జరిగినప్పుడు 27 రోజుల సుదీర్ఘ ప్రయత్నాల తర్వాత ఒకే ఒక్క రోజులో 41 మందిని బయటకు తీసుకువచ్చారు. పక్క నుండి రంధ్రం చేసి లోపలికి వెళ్ళే ఎక్స్పర్ట్ లు ఇట్లాంటి అతి క్లిష్టమైన పరిస్థితులలో పనిచేయగలిగిన ర్యాట్ హోల్ మైనర్ లను టన్నెల్లో చిక్కుకున్న వారిని కాపాడడం కోసం రంగంలోకి దింపారు. అయితే లోపలికి వెళ్తే తప్ప పరిస్థితి ఏంటో చెప్పలేమని వారు స్పష్టం చేశారు. వీరు ఒక చిన్న రంధ్రాన్ని చేసి పక్కనుంచి తవ్వుకుంటూ లోపలికి వెళ్లి ఖచ్చితమైన దారి తెలుసుకున్న తర్వాత అదే రంధ్రాన్ని పెద్దది చేస్తూ బయటకు వచ్చేలా చేస్తారు. ర్యాట్ హోల్ మైనర్లు అయినా లోనికి వెళ్తారా? ఇది చాలా ప్రమాదకరమైన ఎక్స్పరిమెంట్ కావడంతో దీనిని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిషేధించింది. ఇందులో టీం సభ్యుల ప్రాణాలకు కూడా ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంటుంది. అయితే కొన్ని రాష్ట్రాలలో తప్పనిసరి పరిస్థితులలో ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. సొరంగం మట్టి, రాళ్లు నీటిని పరిశీలించి లోపలికి రంధ్రం చేసుకుంటూ వెళ్ళగలరా లేదా అనేది ఈ టీం అంచనా వేస్తారు. ఏమైనా టన్నెల్లో చిక్కుకున్న వారిని బయటకు తీసుకురావడం కోసం రకరకాల ప్రయత్నాలు జరుగుతున్నాయి. టన్నెల్ లో చిక్కుకున్న వారి కోసం అవిశ్రాంతంగా పని చేస్తున్నారు. మంత్రులు సహాయక చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. అయితే సొరంగంలో 8 మంది కార్మికులు చిక్కుకుపోయి రెండు రోజులు దాటిన నేపథ్యంలో వారు సజీవంగా ఉండటం కష్టమే అన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది.

# పీపీపీ మోడ్‌లో నడుస్తున్న రేవంత్ రెడ్డి సర్కార్

- 10 శాతం పర్సెంటేజీ ఇస్తేనే పనులు అవుతున్నాయి
- మిర్చీ క్వింటాకు రూ. 25 వేలు ఇవ్వాలి
- చంద్రబాబుకు ఉన్న సోయి రేవంత్ కు లేదని విమర్శ
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత



**మహా :** కాంగ్రెస్ ప్రభుత్వం పీపీపీ మోడ్‌లో నడుస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. పీపీపీ అంటే ఫోబియా, పాలిటిక్స్, పర్సెంటేజ్ అని విమర్శించారు. ఫోబియా అంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫోబియా పట్టుకుందని ఎద్దేవా చేశారు. మైక్ పట్టగానే కేసీఆర్‌ను తిట్టడం మించి ఇంకో ఆలోచన రేవంత్ రెడ్డికి రాదని విమర్శించారు. ప్రజా సమస్యలు, రైతుల కష్టాలు వదిలేసి ఎన్నికల ప్రచారానికి నిజామాబాద్ వెళ్లారని ధ్వజమెత్తారు. సోమవారం మహబూబాబాద్‌లో పర్యటించిన కవిత మీడియాతో మాట్లాడుతూ, కొంతమంది రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని పదిశాతం సర్కార్ అని పిలుస్తున్నారని ఎద్దేవా చేశారు. పర్సెంటేజీ ఇస్తే పని చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజాపాలన జరగడం లేదని మండిపడ్డారు. మహిళలకు రూ,. 2500 ఇవ్వలేదు కానీ ఇచ్చేశామని పక్క రాష్ట్రంలో ప్రకటనలు ఇస్తున్నారని విమర్శించారు. పీఆర్ స్టంట్ల మీద ఉన్న సోయి ప్రజలకు పనిచేయడంలో లేదన్నారు. ఉచిత బస్సు ప్రయాణం మంచిదే కానీ మహిళల ఆత్మగౌరవం దెబ్బతినే విధంగా చేయవద్దని చెప్పారు. బస్సుల సంఖ్య పెంచాలని అప్పుడే మహిళలతో పాటు అందరికీ సీట్లు దొరుకుతాయన్నారు. ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ 12 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ మొదలు పెట్టిన పనులను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. కేవలం రాజకీయం తప్పా పరిపాలనపై రేవంత్ సర్కారుకు దృష్టి లేదని చెప్పారు. మిర్చి రైతులు కన్నీరు పెట్టే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏపీలో ఇదే పరిస్థితి ఏర్పడితే మద్దతు ధర కోసం సీఎం చంద్రబాబు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తున్నారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆ మాత్రం సోయి ఎందుకు లేదని ప్రశ్నించారు. ఎస్ఎల్బీసీ సొరంగం కూలిపోతే దాన్ని సందర్శించే సోయి లేని ముఖ్యమంత్రి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి వెళ్లారని ఆగ్రహించారు. ప్రజలకు ఏం చేశారని ప్రచారం చేయడానికి వెళ్లారని నిలదీశారు. రైతు రుణమాఫీ ఎవరికీ పూర్తిగా కాలేదని చెప్పారు. రైతు భరోసా గ్రామాల్లో చాలా మందికి రాలేదని చెప్పుకొచ్చారు. రుణమాఫీ పేరిట రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని కవిత విమర్శించారు. ప్రభుత్వ నిర్వాకం వల్ల రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని వాపోయారు. క్వింటా మిర్చికి రూ .25 వేల మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. వరదలు వచ్చినప్పుడు చేస్తామన్న సాయాన్ని కూడా రేవంత్ ప్రభుత్వం ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. వరద బాధితులకు సీఎం రేవంత్ రెడ్డి ఇళ్లు ఇస్తామని చెప్పి ఇవ్వలేదని ఫైర్ అయ్యారు. వరదలొచ్చినా, కన్నీళ్లిచ్చినా, కష్టాలొచ్చినా అండగా ఉండేది గులాబీ జెండానే అని ఉద్ఘాటించారు. కేసీఆర్ హయాంలో మహబూబాబాద్ జిల్లా అభివృద్ధి చెందిందని గుర్తుచేశారు. కేసీఆర్ హయాంలో మంజూరైన పనులను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలని కవిత డిమాండ్ చేశారు.

# పొలాల్లోకి కలెక్టర్.. రైతుకు భరోసాగా

- ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పనితీరుకు ప్రశంసలు
- ఆయకట్టు రైతుకు నీరు, యూరియాపై అభయం



**ఖమ్మం, మహా:** సాధారణంగా, రైతుల సమస్యలు అధికార మేడల్లోని గదుల్లో, సమావేశాల్లో, దూరంగా గల పత్రాల ద్వారా మాత్రమే తెలుసుకుంటారు. కానీ, నిజమైన సమస్యలను అర్థం చేసుకోవాలంటే, రైతుల మధ్య నేరుగా వెళ్లి మాట్లాడాలి, వారి పొలాల్లో నడవాలి, మట్టిని తాకాలి. రైతు బతుకు మట్టి బతుకే. ఆయన ఆకాశంలో విహరించడు, ఆయన కష్టం పొలాల్లో కనిపించాలి. ఖమ్మం జిల్లా కలెక్టర్ ఈ నిజాన్ని అర్థం చేసుకున్నారు.

రైతుల సమస్యలను స్వయంగా అర్థం చేసుకోవాలనే తపనతో, కలెక్టర్ స్వయంగా పొలం గట్లపై నడుచుకుంటూ సాగునీటి లభ్యతను పరిశీలించారు. వ్యవసాయ భూములను ప్రత్యక్షంగా పరిశీలిస్తూ, సాగర్ జలాలు చివరి ఆయకట్టుకు చేరుతున్నాయా? అన్న ప్రశ్నకు ప్రత్యక్ష సమాధానం తెలుసుకునేందుకు ముందుకు వచ్చారు. మండుటెండను లెక్కచేయకుండా, మట్టిలోకి దిగి రైతులతో మమేకమయ్యారు. "మీరు ఏమంటున్నారు? సాగు పరిస్థితి ఎలా ఉంది? నీళ్లు అందుతున్నాయా? ఎరువుల కొరత ఉందా? మార్కెట్లో సరైన ధర వస్తోందా?" అంటూ ఒక్కొక్కరు దగ్గరకు వెళ్లి మాట్లాడారు. ఇది కేవలం ఒక అధికారిక పర్యటన కాదు. ఇది రైతుల పట్ల చూపిన నిస్వార్థమైన మానవీయ కోణం. ఇది రైతుల గుండెల్లో నాటిన ఒక భరోసా. "రైతును అర్థం చేసుకోవాలంటే, మట్టి తాకాలి. ఆయన కష్టాన్ని నేరుగా చూడాలి" అనే తత్వాన్ని అవలంబించిన కలెక్టర్, నిజమైన ప్రజాసేవకుడిగా నిలిచారు. సోమవారం జిల్లా కలెక్టర్ పెనుబల్లి మండలం టేకులపల్లి గ్రామంలో పర్యటించి వ్యవసాయ పొలాల వెంబడి రెండు కిలోమీటర్ల వరకు నడుస్తూ రైతులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా రైతుల పంట పొలాలకు సాగు నీటి విడుదల సమయంలో చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.





# కేసీఆర్, కేటీఆర్‌కు బీజేపీనే రక్ష

(మొదటి పేజీ తరువాయి)

నేను చెప్పింది అబద్ధమైతే మాకు ఓటు వేయొద్దు. నిజమని నమ్మితే కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించండి అని సీఎం పిలుపునిచ్చారు.

**వాళ్లని దేశానికి రప్పించండి.. మేమేం చేయాలో అది చేస్తాం**

గొర్రెల స్కామ్, ఫార్ములా ఈరేసు కేసులు పెడితే.. పేపర్లన్నింటినీ ఈడీ తీసుకెళ్లింది. ఫోన్ ట్యాపింగ్ కేసును అడ్డుపెట్టుకుని లోక్‌సభ ఎన్నికల్లో భాజపా గెలిచింది. ఆ కేసులో నిందితులుగా ఉన్న ప్రభాకర్‌రావు, శ్రవణ్‌రావును కేంద్రమంత్రి బండి సంజయ్ ఎందుకు భారత్‌కు రప్పించడం లేదు?వాళ్లని మన దేశానికి రప్పించండి.. ట్యాపింగ్ కేసులో ఏం చేయాలో 48గంటల్లోనే మేం అది చేస్తాం. ఆర్‌ఆర్‌ఆర్ భూసేకరణకు భాజపా ఎంపీ ఈటల రాజేందర్ అడ్డంగా పడుకుంటున్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఈటల కలిసి రాష్ట్రం అభివృద్ధి కాకుండా కుట్రలు చేస్తున్నారు. హైటెక్ సిటీ కట్టింది మేమే. ఫ్యూచర్ సిటీ కట్టేది కూడా మేమే'' అని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

**ఫామ్ హౌస్‌లో కూర్చుని ప్రభుత్వంపై కేసీఆర్ కుట్రలు**

''కేసీఆర్ అవసరం రాష్ట్రానికి లేదని ప్రజలు తీర్పు ఇచ్చారు. రాష్ట్రంతో పేగుబంధం తెంచుకుని పార్టీ పేరు కూడా మార్చుకున్నారు. చేసింది చాలు.. ఇక ఫామ్‌హౌస్‌లో విశ్రాంతి తీసుకోవాలని ప్రజలు ఆయనకు చెప్పారు. ప్రజలు తిరస్కరించినా కేసీఆర్‌లో మార్పు రాలేదు. ఫామ్ హౌస్‌లో కూర్చుని ప్రభుత్వంపై కుట్రలు చేస్తున్నారు. పదేళ్లపాటు ఏమీ చేయని భారాస నేతలు.. ఇవాళ మమ్మల్ని తప్పుపడుతున్నారు. ఏడాదిలోనే మేం ఏమీ చేయలేదని దుష్ప్రచారం చేస్తున్నారు. పదేళ్లపాటు నోటిఫికేషన్లు ఇవ్వలేదు. ఇచ్చిన వాటి మీద వాళ్లే కేసులు వేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలోనే 55,163 మందికి ఉద్యోగాలు ఇచ్చింది. 11వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసింది. గత ప్రభుత్వం పదేళ్లపాటు టీచర్లకు పదోన్నతులు, బదిలీలు కల్పించలేదు. మా ప్రభుత్వం రాగానే వాటిని పూర్తిచేశాం.

**నైపుణ్యాభివృద్ధి కేంద్రాలుగా 65 ఐటీఐలు**

చదువుతున్న యువతలో నైపుణ్యాలు పెంచేందుకు కృషి చేస్తున్నాం. టాటా సంస్థతో కలిసి 65 ఐటీఐలను నైపుణ్యాభివృద్ధి కేంద్రాలుగా మార్చాం. స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశాం. క్రీడల్లో యువత రాణించేందుకు స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నాం. నిజామాబాద్‌కు చెందిన బాక్సర్ నిఖత్ జరీన్‌కు గ్రూప్1 ఉద్యోగం ఇచ్చి రూ.2కోట్ల ప్రోత్సాహక నగదు అందజేశాం. క్రికెటర్ సిరాజ్‌కు ఎన్నో మినహాయింపులతో గ్రూప్ 1 ఉద్యోగం ఇచ్చాం. పారా అథ్లెట్, వరంగల్ బిడ్డ జివాంజీ దీప్తికి ఇంటి స్థలం, రూ.25లక్షలు ఇచ్చాం. కేసీఆర్ పాలనలో ఏనాడూ ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు రాలేదు. ఉద్యోగులు రిటైర్ అయితే వాళ్లకు బెనిఫిట్స్ ఇవ్వలేని స్థితికి రాష్ట్రాన్ని తీసుకెళ్లారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు కేసీఆర్ రూ.8వేల కోట్ల బకాయిలు పెట్టి వెళ్లారు. దేశంలో ఎవరూ చేయని సాహసాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టింది. రాహుల్‌గాంధీ ఆశయం మేరకు రాష్ట్రంలో కులగణన సర్వే పూర్తిచేశాం. వందేళ్లుగా జరగని కులగణనను సమర్థంగా నిర్వహించాం.

**చీకటి ఒప్పందం వల్లే బీఆర్ఎస్ దూరం**

భాజపా, భారాస మధ్య చీకటి ఒప్పందాలు కుదిరాయి. ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారాస ఎందుకు పోటీ చేయడం లేదు? ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్, కేటీఆర్‌ను భాజపా కాపాడుతోంది. ఆ కేసును అడ్డుపెట్టుకుని ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారాస మద్దతు తీసుకుంటోంది. భాజపాకు మద్దతు ఇవ్వకపోతే ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్ట్ తప్పదని వారిని బెదిరించారు. అమెరికాకు పారిపోయిన ప్రభాకర్‌రావు, శ్రవణ్‌రావును కేంద్రం ఎందుకు రప్పించడం లేదు? రెడ్ కార్నర్ నోటీసు జారీ చేయాలని కేంద్రాన్ని కోరితే ఎందుకు పక్కన పెట్టారు?ఈకార్ రేసింగ్ కేసులో ఈడీ అధికారులు కేటీఆర్‌ను ఎందుకు అరెస్ట్ చేయడం లేదు?'' అని రేవంత్ ప్రశ్నించారు. సమ్మేళనాలలో టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్క, పొన్నం ప్రభాకర్, కొండాసురేఖ, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రేమ్ సాగర్ రావు, వివేక్, ఆది శ్రీనివాస్, గడ్డం వినోద్, లక్ష్మణ్, బొజ్జు, ఇన్ ఛార్జిలు కంది శ్రీనివాసరెడ్డి, గజేందర్ తదితరులు పాల్గొన్నారు.

**సురేఖపై ప్రశంసలు**

మంచిర్యాల ప్రజలకు ఒక్కరిని గెలిపిస్తే 24గంటలు సేవచేసే ఇద్దరు దొరికారని, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావుతో పాటు జిల్లా అధ్యక్షురాలు సురేఖ అద్భుత సేవలు అందిస్తున్నారని సీఎం రేవంత్ ప్రశంసించారు.

## వన్యప్రాణుల సంరక్షణకు
# కట్టుబడి ఉన్నాం

**8వ రాష్ట్ర వన్యప్రాణుల సంరక్షణ బోర్డు సమావేశంలో మంత్రి కొండా సురేఖ**



**మహా :** వన్యప్రాణుల సంరక్షణ విషయంలో ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉందని అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో 8వ రాష్ట్ర వన్యప్రాణుల సంరక్షణ బోర్డు (ఎస్ బీ డబ్ల్యుఎల్) సమావేశం మంత్రి కొండా సురేఖ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వన్యప్రాణుల సంరక్షణ, అటవీ, పర్యావరణ పరిరక్షణ అంశాలకు సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అటవీ, జీవవైవిధ్య నిర్వహణ మెరుగుపరిచే దిశగా నిపుణుల సూచనలను స్వాగతించారు. 7వ ఎస్ బిడబ్ల్యూఎల్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుపై సమీక్షించిన మంత్రి జాతీయ వన్యప్రాణుల సంరక్షణ మండలి (ఎన్ బీడబ్ల్యూఎల్) సమీక్షకు పంపిన పలు ముఖ్య ప్రాజెక్టులపై ఆరా తీసారు. సమావేశంలో ప్రధాన అటవీ సంరక్షణాధికారి మాట్లాడుతూ 1972 వన్యప్రాణుల సంరక్షణ చట్టం ప్రకారం రాష్ట్ర వన్యప్రాణుల సంరక్షణ బోర్డు ఏర్పాటు తప్పనిసరిగా జరగాల్సిన అంశమని వివరించారు.

**సమావేశంలో తీసుకున్న ప్రధాన నిర్ణయాలు:**

1. పోచారం వన్యప్రాణుల అభయారణ్యం నుంచి వెళ్లే మెదక్ ఎల్లారెడ్డి రహదారి విస్తరణకు అనుమతి మంజూరు.
2. అటవీ ప్రాంతాల్లో ఓఎఫ్ సీ లైన్ల ఏర్పాటు ప్రతిపాదనలపై చర్చ.
3. ములుగులో 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం, నాగార్జునసాగర్ డివిజన్‌లో పెద్దగట్టు ఎత్తిపోతల పథకానికి అనుమతి.
4. యానిమల్ పాసేజ్‌ల మార్పుల కోసం 18 ప్రతిపాదనలు, మొబైల్ టవర్ల కోసం 13 ప్రతిపాదనలపై సమీక్ష. ఎన్ బీడబ్ల్యుఎల్ కి పంపే ముందు అవసరమైన సవరణలపై చర్చ.
5. మీసేవ ద్వారా యానిమల్‌మ్యాన్ కాంఫ్లిక్ట్ బాధితులకు పరిహారం చెల్లించడానికి కార్పస్ నిధి గురించి చర్చించారు.
6. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌ల నుంచి 1,088 కుటుంబాల పునరావాసం వివరాలపై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్న మంత్రి.
7. కమ్యూనిటీ ఆధారిత ఎకో టూరిజం ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష. అలాగే కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లో భారీ వాహనాల రాకపోకలపై నిషేధాన్ని తొలగించే అంశాల పరిశీలన.
8. రాష్ట్రవ్యాప్తంగా జంతు ప్రదర్శనశాలలు, జాతీయ పార్కులు, ఇంకా పట్టణ పార్కుల అభివృద్ధి కోసం ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాలని మంత్రి సూచన. స్థానిక సేంద్రీయ చెట్లను ప్రాధాన్యతగా పెంచి, సహజ అటవీ వ్యవస్థను పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

సమావేశం చివరిలో బోర్డు సభ్యుల సూచనలను మంత్రి సురేఖ అభినందించారు. ఈ సమావేశంలో ఎస్ బీడబ్ల్యుఎల్ సభ్యులు, ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, రామ్‌దాస్ నాయక్, ముఖ్య కార్యదర్శి నదీమ్, పీసీసీఎఫ్ దోబ్రియాల్, ఎలు సింగ్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మోగిన మరో ఎన్నికల నగారా

(మొదటి పేజీ తరువాయి)




ప్రస్తుతం ఎమ్మెల్సీలుగా కొనసాగుతోన్న హసన్ మీర్జా, యెగ్గె మల్లేశం, శేరి సుభాష్ రెడ్డి, మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్ పదవీ కాలం మార్చి 29న ముగుస్తుండగా ఖాళీ కానున్న ఈ స్థానాలకు ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు. రాష్ట్రంలో మొత్తం ఎమ్మెల్యేల సంఖ్య 119 కాగా, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున 64 మంది విజయం సాధించారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి 39 మంది ఎమ్మెల్యేలు గెలిచారు. వారిలో 10 మంది కాంగ్రెస్ గూటికి చేరారు. మొత్తం 5 స్థానాలకు గాను సంఖ్యాపరంగా కాంగ్రెస్ నాలుగు స్థానాలు, బీఆర్ఎస్ ఒక స్థానం దక్కించుకునే అవకాశాలున్నాయి. అయితే బీఆర్ఎస్ పార్టీ నుంచి అధికార కాంగ్రెస్ పార్టీలో చేరిన 10 మంది ఎమ్మెల్యేలకు బీఆర్ఎస్ విప్ జారీ చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో రెండు టీచర్, ఒక గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలు జరుగుతున్నాయి. మెదక్ ఆదిలాబాద్ నిజామాబాద్ కరీంనగర్ టీచర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానంతో పాటుగా నల్గొండ ఖమ్మం వరంగల్ టీచర్ స్థానానికి ఈనెల 27న పోలింగ్ జరగనుంది. ఈ మూడు ఎమ్మెల్సీ ఎన్నికలకు బీఆర్ఎస్ పార్టీ దూరంగా ఉండగా కాంగ్రెస్, బీజేపీ, పలువురు స్వతంత్ర్య అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. పోలింగ్ తేదీ దగ్గర పడుతుండటంతో అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఎవరికి వారు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు. ఈ ఎన్నిక ముగియగానే మార్చి 3న ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కానుండటంతో రానున్న నెల రోజుల పాటు రాష్ట్రంలో ఎన్నికల హడావుడి కొనసాగనుంది.

## సంక్షిప్తంగా...

- ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల
- ఏపీలో ఐదు, తెలంగాణలో ఐదు ఖాళీలకు షెడ్యూల్
- మార్చి 3న నోటిఫికేషన్ విడుదల
- మార్చి 20న పోలింగ్, అదే రోజు కౌంటింగ్
- ఏపీలో రిటైర్ కానున్న జంగా కృష్ణమూర్తి, యనమల, పరుచూరి అశోక్‌బాబు, తిరుమల నాయుడు, రామారావు
- తెలంగాణలో రిటైర్ కానున్న మహమూద్ అలీ, సత్యవతి
- శేరి సుభాష్‌రెడ్డి, మల్లేశం, రియాజుల్ హుస్సేన్
- ఈ నెల 29తో ముగియనున్న ఎమ్మెల్సీ పదవీకాలం
- మార్చి 10 నుంచి నామినేషన్ల స్వీకరణ, 11న పరిశీలన
- నామినేషన్ల ఉపసంహరణకు మార్చి 13 వరకు గడువు

**సామాజిక వర్గాలవారీగా ఇచ్చే ఛాన్స్**

- రెడ్డి సామాజిక వర్గం నుండి జీవన్ రెడ్డి, జగ్గారెడ్డి, సామ రామ్మోహన్ రెడ్డి, కంది శ్రీనివాసరెడ్డి
- బీసీ సామాజిక వర్గం నుండి చరణ్ కౌశిక్ యాదవ్,అంజన్ కుమార్ యాదవ్,వజ్రేష్ యాదవ్
- ముదిరాజ్ సామాజిక వర్గం నుండి రేసులో సునీతారావు,నీలం మధు
- కమ్మ సామాజిక వర్గం నుండి కుసుమ కుమార్
- మైనారిటీ సామాజిక వర్గం నుండి ,షబ్బీర్ అలీ, ఫిరోజ్ ఖాన్, ఫహీం ఖురేషి,అజరుద్దీన్, అజ్మతుల్లా
- ఎస్సి సామాజిక వర్గం నుండి అద్దంకి దయాకర్, సంపత్ కుమార్
- ఎస్టీ సామాజిక వర్గం నుండి బెల్లయ్య నాయక్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ పోటీ

# ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లను రోడ్డున పడేస్తారా?

**సీఎం రేవంత్‌కు కిషన్‌రెడ్డి బహిరంగ లేఖ**

(మొదటి పేజీ తరువాయి)



14 నెలల మీ పాలన అసంతృప్తిగా ఉందని, డీఏలు, జీపీఎఫ్, పెండింగ్ బకాయిలు చెల్లించకుండా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లను రోడ్డున పడేస్తారా? అని ప్రశ్నించారు. రిటైర్మెంట్ బెన్‌ఫిట్స్ కూడా చెల్లించకుండా మానసిక క్షోభకు గురిచేయడం ఎంత వరకు న్యాయమని అన్నారు. ఉద్యోగులకు రోటీన్ గా చెల్లించాల్సిన బిల్లుల్లో కూడా సీలింగ్ పెట్టడం సిగ్గు చేటన్నారు. నిజాయితీగా పనిచేసే ఉద్యోగులకు మీరు ఏ సందేశం ఇస్తున్నట్లు? అని అన్నారు. కళాశాలల యాజమాన్యాల పట్ల మీ తీరు దుర్మార్గం, ఏళ్ల తరబడి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా వేధిస్తున్నారని మండిపడ్డారు. 'ఏప్రిల్, మే నెలలో బకాయిలు చెల్లిస్తామని కాలేజీ యాజమాన్యాలను మళ్లీ మభ్యపెట్టడం ఎంత వరకు కరెక్ట్?, ఎమ్మెల్సీ ఎన్నికల్లో గట్టెక్కేందుకు మళ్లీ మోసపూరిత హామీలకు సిద్ధమవడం సిగ్గు చేటు, నిరుద్యోగ భృతి ఆశ చూపి 14 నెలలుగా రూ.56 వేల బకాయిపడి యువతను దగా చేశారు. మీలో ఏమాత్రం నిజాయితీ ఉన్నా యుద్ధ ప్రాతిపదికన బకాయిలు విడుదల చేయండి. ఈరోజే రూ.7500 కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్ సొమ్మును కాలేజీ యాజమాన్యాల ఖాతాల్లో జమ చేయండి' అంటూ కిషన్‌రెడ్డి లేఖలో పేర్కొన్నారు.

# రష్యా అల్లుడికి జర్మనీ గురించి బాగా తెలుసనుకుంటా

**ప్రతిపక్ష హోదా అడుగుతుంటే పవన్ కళ్యాణ్ వంకరగా మాట్లాడుతున్నారు**

**మాజీ మంత్రి ఆర్ కే రోజా**




**అమరావతి, మహా :** ఓట్ల శాతం ప్రకారం ప్రతిపక్ష హోదా కావాలని అనుకుంటే గనుక జర్మనీకి వెళ్లాలంటూ జనసేన అధినేత, డిప్యూటీ సీఎం వ్యాఖ్యలకు వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి ఆర్ కే రోజా స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. రష్యా అల్లుడికి జర్మనీ గురించి బాగా తెలుసనుకుంటా అంటూ రివర్స్ పంచ్ ఇచ్చారు ఆర్ కే రోజా. సోమవారం తాడేపల్లి వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యాలయం నుంచి మాట్లాడిన ఆర్ కే రోజా.. ఎవరికైనా మేలు చేయాలంటే అది వైఎస్ జగన్‌కే సాధ్యమన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించడానికి ప్రతిపక్ష హోదా అడుగుతుంటే, దీనిపై పవన్ కళ్యాణ్ వంకరగా మాట్లాడుతున్నారని రోజా ధ్వజమెత్తారు. ఈ క్రమంలోనే రష్యా అల్లుడికి జర్మనీ గురించి బాగా తెలుసనుకుంటా అంటూ సెటైర్లు వేశారు రోజా. ఒకవేళ పవన్ కు ప్రతిపక్ష హోదా కావాలనుకుంటే డిప్యూటీ సీఎం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

# రూ.49 వేల కోట్లు కావాలి

## బడ్జెట్ అంచనాలు సిద్ధం

### ప్రభుత్వానికి పీఆర్ అధికారుల ప్రతిపాదనలు




**మహా :** పంచాయతీ రాజ్ శాఖ 202526 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంచనాలు రూపొందించింది. రూ. 49.44 వేల కోట్లతో బడ్జెట్ తయారు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసింది. గతేడాది కన్నా ఈసారి రూ.వెయ్యి కోట్లు అదనంగా బడ్జెట్ అంచనాలు పెట్టింది. ఈసారి బడ్జెట్ అంచనాల్లో అత్యధికంగా ఆపరేషన్, పథకాల నిర్వహణకు రూ. 8,963.63 కోట్లు అవసరమవుతాయని అధికారులు ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో తెలిపారు. ఇందులో వేతనాలు, రిపేర్లు, మౌలిక వసతులు, గ్రిడ్‌కు రూ.1,841.7 కోట్లు, విద్యుత్ వినియోగ చార్జీలకు రూ.5,876.95 కోట్లు, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీకి చెల్లించాల్సిన వాటర్ చార్జీలు రూ.986.59 కోట్లు, మురుగునీటి శుద్ధి చార్జీలు రూ.1,98.81కోట్లు, రవాణా కోసం రూ.9.47 కోట్లు, వేసవిలో అమలు చేయాల్సిన పనుల కోసం రూ.50.7 కోట్లు కేటాయించాలని ప్రతిపాదనలు చేశారు. అలాగే.. రాష్ట్ర ప్రణాళిక కింద పథకాలకు రూ.1,504.36 కోట్లు, నాబార్డు ఆర్ఐడీఎఫ్‌కు రూ.124.36 కోట్లు, మిషన్ భగీరథ పథకానికి రూ.979.07 కోట్లు, టీడీడబ్ల్యూ ఎస్సీఎల్ చెల్లింపులకు రూ.4,048.29 కోట్లు, వేతనాల జీతాల కోసం రూ.319.26 కోట్లను బడ్జెట్ అంచనాల్లో పొందుపర్చారు.

**ఈసారి పెరిగిన అంచనాలు**

ఈ బడ్జెట్‌లో ఎంపీపీ, జిల్లా పరిషత్ భవనాలకు నిధులు పెంచాలని ప్రభుత్వాన్ని పంచాయతీ రాజ్ శాఖ కోరింది. 202425 సంవత్సరంలో రూ.11.08 కోట్లు బడ్జెట్ పెడితే 202526 సంవత్సరానికి రూ.728 కోట్లు కేటాయించాలని బడ్జెట్‌లో ప్రతిపాదించారు. అలాగే, వర్షాలకు కొట్టుకుపోయిన రోడ్ల మరమ్మతులకు కూడా అంచనాలు పెంచారు. గత ఏడాది వీటి కోసం రూ. 200 కోట్ల కోసం ప్రపోజల్స్ పంపగా ప్రస్తుతం రూ.500 కోట్లకు పంపారు. మహిళా స్వయం సహాయక గ్రూపు సభ్యులకు బీమా కోసం గతేడాది రూ.55.41 కోట్లు కేటాయించగా.. ఈ బడ్జెట్‌లో 68.75 కోట్లు కావాలని ప్రభుత్వానికి అందజేసిన నివేదికలో పేర్కొన్నారు. ఈసారి పంచాయతీ ఎన్నికలు ఉండడంతో ప్రత్యేకంగా రూ.3.25 కోట్లు అవుతాయని అంచనాలను రూపొందించారు.

# కోహ్లీ కన్నా కేసీఆర్‌దే పెద్ద రికార్డు

**మహా, హైదరాబాద్:** మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై మంత్రి కొండా సురేఖ సెటైర్లు పేల్చారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత ప్రతిపక్ష హోదా అందుకున్న కేసీఆర్.. అసెంబ్లీకి రాకపోవడం, ప్రజా సమస్యలపై ఎక్కడా గళమెత్తి ప్రశ్నించకపోవడంపై కొండా సురేఖ ప్రశ్నించారు. ఈమేరకు తనదైన శైలిలో ఎక్స్(ట్విట్టర్) వేదికగా ఆసక్తికర పోస్ట్ పెట్టారు. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ మారుతోంది. నిన్న దుబాయ్ వేదికగా జరిగిన ఇండియా, పాకిస్థాన్ మ్యాచ్‌ను ప్రస్తావిస్తూ కొండా సురేఖ.. కేసీఆర్‌పై సెటైర్లు పేల్చారు. పాకిస్థాన్‌పై సెంచరీ చేసి కోహ్లీ సాధించిన రికార్డు కంటే ఫామ్ హౌస్‌లో ఉండి కేసీఆర్ చేసిన రికార్డ్ ఇంకా పెద్దదంటూ చురకలంటించారు.

**కొండా సురేఖ పోస్ట్ ఇదే..**

''దుబాయ్ వేదికగా పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో టీమిండియా ఘన విజయం సాధించడం హర్షణీయం. 6 వికెట్ల తేడాతో భారత్ బంపర్ విక్టరీ కొట్టిన విషయం మన అందరం టీవీలో చూసి సంబురపడినం. 14 వేల పరుగులు చేసి విరాట్ కోహ్లీ.. సచిన్ రికార్డు బద్దలు కొట్టగా... మన రాష్ట్ర ప్రతిపక్ష నేత కేసీఆర్ కూడా దాదాపు ఈ 14 నెలల కాలంలో 14 రోజులు కూడా అసెంబ్లీకి రాకపోవడం... ప్రజా సమస్యలపై ప్రజలకి అందుబాటులో ఉండకపోవడం దేశ రాజకీయ చరిత్రలో పెద్ద రికార్డే కదా. 14 వేల రన్నులు చేసిన విరాట్ కోహ్లీ ఒకవైపు వార్తల్లో పతాక శీర్షికలలో నిలిస్తే... 14 నెలలుగా ఇంకా విరాట పర్వం వీడని మన ప్రతిపక్ష నేత కేసీఆర్ కూడా వార్తల్లోకి ఎక్కడం ఆలోచించాల్సిన విషయం కాదా?'' అంటూ పంచ్‌లు పేల్చారు మంత్రి. మాజీ సీఎంపై మంత్రి కొండా సురేఖ చేసిన కామెంట్స్‌ను ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

# రేవంత్ విజన్ ఉన్న నాయకుడు

**పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్**

(మొదటి పేజీ తరువాయి)



ముఖ్య అతిథిగా పాల్గొన్న పీసీసీ చీఫ్ మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి విజన్ ఉన్న నాయకుడని, ధైర్యం ఉంది కాబట్టే సీఎం అయ్యాడని అన్నారు. తెలంగాణ ప్రజలను కేసీఆర్ పదేళ్లు ఆశల పల్లకి లో ఊరేగించారని మండిపడ్డారు. కాంగ్రెస్ 9 నెలల్లో 50 వేల ఉద్యోగాలిచ్చిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో 2 కోట్ల ఉద్యోగాలు పీకేసిందని ఆరోపించారు. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు అడుగుతున్నారని బీజేపీ తీరుపై మండిపడ్డారు

# పీఎం కిసాన్ నిధులు విడుదల చేసిన ప్రధాని నరేంద్ర మోదీ



**మహా:** రైతులకు పెట్టుబడి సాయం కింద కేంద్ర ప్రభుత్వం అందించే పీఎంకిసాన్ నిధులు సోమవారం జమ అయ్యాయి. పీఎం కిసాన్ యోజన కింద 19వ విడత నిధులను ఈరోజు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విడుదల చేశారు. బీహార్‌లోని భాగల్‌పూర్‌లో జరిగిన కార్యక్రమంలో భాగంగా రూ.22 వేల కోట్లకు పైగా నిధులను విడుదల చేశారు. ఈ నిధులతో 9.7 కోట్ల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. పీఎం కిసాన్ పథకం కింద ఒక్కో విడత రూ.2 వేల చొప్పున ఏడాదికి మూడు విడతలు మొత్తం రూ.6 వేలు రైతుల ఖాతాల్లో జమ అవుతాయి.

EDITORIAL సంపాదకీయం

# సొరంగ ప్రమాదానికి రాజకీయ విపత్తు!!

**ఎస్.ఎల్.బీ.సీ.సొరంగంలో పై కప్పు కూలిన దుర్ఘటనలో 8 మంది కార్మికుల ఆచూకీ ఇంకా దొరకలేదు.ఇది పూర్తిగా ప్రకృతి విపత్తుగా మంత్రి ఉత్తమ్ సోమవారం ప్రకటించారు.కానీ ఈ ఘటనను ప్రభుత్వంపై బురద జల్లడానికి,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అప్రదిష్టపాల్జేయడానికి బిఆర్ఎస్ శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తోంది.రేవంత్ ప్రభుత్వానికి 'రాజకీయ విపత్తు' సృష్టించేందుకు కేటీఆర్,హరీశ్ ప్రయత్నిస్తున్నారు.**





- ఎస్.కే.జకీర్, సీనియర్ జర్నలిస్ట్

సొరంగం పై కప్పు కూలిన చోట చిక్కుకున్న ఎనిమిది మందిని కాపాడడం కోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సర్వశక్తులు ఒడ్డుతున్నాయి. సంఘటనా స్థలిలో పరిస్థితి గంభీరంగా ఉన్నది.కానీ వాటర్ ఫ్లోటింగ్ తో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడుతోంది.వాటర్ ఫ్లోటింగ్ కు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.రంగంలోకి భారత సైనిక బలగాలు కూడా దిగాయి.ఈ తరహా సంఘటనలు చోటుచేసుకున్నప్పుడు భారత సైన్యం సాహసోపేతంగా రెస్క్యూ చర్యలు తీసుకుంటుందన్న సంగతి మనం దరికీ తెలిసిందే.ఎన్.డి.ఆర్.ఎఫ్,ఎస్.డి.ఆర్.ఎఫ్ బలగాలను ఆర్మీకన్నా ముందే రంగంలోకి దింపారు. ఇంజినీరింగ్ అధికారులతో పాటు సహాయక చర్యలు చేపట్టిన వారితో ఎప్పటికప్పుడు ప్రభుత్వం సమీక్షిస్తోంది.ప్రమాద వార్త తెలిసిన వెంటనే జరిగిన రాష్ట్ర ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన సహాయకచర్యలు చేపట్టింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ప్రధాని మోడీ,ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడారు.తాజా పరిస్థితిని తెలుసుకుంటున్నారు.

''టన్నెల్ ప్రమాద ఘటనను చిల్లర రాజకీయాలు చేయకండి.ఎస్.ఎల్.బి.సి ని బి.ఆర్.ఎస్ పాలకులు చేసిన నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణం.ఏ టన్నెల్ నిర్మాణం జరిగినా లీకేజ్ లు సర్వసాధారణం. బి.ఆర్.ఎస్ ప్రభుత్వ హయాంలో కుడా ఈ తరహా లీకేజ్ లు ఏర్పడ్డాయి.సొరంగం తవ్వకాల సమయంలో ఏర్పడ్డ లీకేజ్ ఈ ప్రమాదానికి కారణం అయి ఉండొచ్చు. టన్నెల్ ప్రమాద ఘటనలో బి.ఆర్.ఎస్ చిల్లర రాజకీయాలు మానుకోవాలి.కమిషన్లు తప్ప ప్రాజెక్ట్ ల నిర్మాణాల గురుంచి పట్టించుకోని వారు మాట్లాడడం హాస్యాస్పదంగా ఉంది''అని ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

ఎస్.ఎల్.బి.సి టన్నెల్ ప్రమాదంలో చిక్కుకున్న ఎనిమిది మంది కార్మికులను రక్షించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా ప్రయత్నాలు చేస్తోంది.రాష్ట్ర ప్రభుత్వం,ఆర్మీ,నేవీ,నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్,స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, ఇతర ఏజెన్సీలు సమిష్టిగా పనిచేస్తున్నాయి.డీ వాటరింగ్ ప్రక్రియ కొనసాగుతోంది.టన్నెల్ లో చిక్కుకున్న కార్మికుల కోసం నిరంతరం ఆక్సిజన్ పంపిణీ చేస్తున్నారు.సహాయక చర్యలను ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.మొత్తం ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండి పనిచేస్తోంది.సీఎంతో మాట్లాడిన ప్రధాని మోదీ కేంద్రప్రభుత్వం నుంచి అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.టన్నెల్ లోని సహజ రాతి నిర్మాణాలు సడలడంతో అకస్మాత్తుగా నీరు,మట్టి ప్రవహించడంతో ప్రమాదం జరిగినట్టు ప్రాథమికంగా నిర్ధారణకు వస్తున్నారు.దాంతో టన్నెల్ లో దాదాపు ఇరవై అడుగులకు పైగా నీరు నిండిపోయింది.సహాయకచర్యలకు ఆటంకం కలుగుతున్నందున దీనిని పరిష్కరించేందుకు సాంకేతిక నిపుణులు రాత్రింబవళ్లు కృషి చేస్తున్నారు.

ప్రమాదం చోటు చేసుకున్న ప్రాంతం భౌగోళికంగా క్లిష్టమైన ప్రదేశం కావడంతో భారీ యంత్రాలను అక్కడికి చేర్చడం కష్టంగా మారింది. అధికారులు ప్రత్యామ్నాయ పద్ధతుల ద్వారా మట్టి దిబ్బలు తొలగించేందుకు కృషి చేస్తున్నారు.నీటిపారుదల శాఖ,విపత్తు నిర్వహణ బృందాలు,రక్షణ దళాలు సంయుక్తంగా సహాయ చర్యలు నిర్వహిస్తున్నాయి.ప్రమాదం ఫిబ్రవరి 22 వ తేదీ ఉదయం జరగగానే సీఎం రేవంత్ రెడ్డి ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి,మరో మంత్రి జూపల్లి కృష్ణారావు,కొందరు ఉన్నతాధికారులను ఘటనా స్థలానికి పంపించారు.అదే రోజు రాత్రి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహాయ చర్యల వ్యూహాన్ని సమీక్షించారు.చీఫ్ సెక్రెటరీ శాంతి కుమారి,నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా,కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల విపత్తు నిర్వహణ బృందాల అధికారులతో ముఖ్యమంత్రి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు.సహాయకచర్యల పురోగతిని అంచనా వేసి,అవసరమైన సూచనలు అందించారు.

> కాళేశ్వరం ప్రాజెక్టు పదో ప్యాకేజీలో రాజన్న సిరిసిల్ల జిల్లా తిప్పాపూర్ వద్ద సొరంగ మార్గంలో 2017 లో జరిగిన ప్రమాదంలో ఏడుగురు ప్రాణాలు కోల్పోయిన విషయాన్ని కాంగ్రెస్ పార్టీ బలంగా ప్రచారంలోకి తీసుకువెళ్లలేకపోతోంది. మూడు గుట్టల మధ్య 92 మీటర్ల లోతు, 56 మీటర్ల డయాతో సర్జ్‌పూల్ అనే మహాబావిని,మిడ్ మానేరు నుంచి 3 కిలోమీటర్ల కాలువను,8 కిలోమీటర్ల సొరంగమార్గాన్ని నిర్మించారు. 9.5 మీటర్ల డయాతో రోజూ 11 వేల క్యూసెక్కుల నీరు ప్రవహించేవిధంగా సొరంగమార్గాన్ని నిర్మించారు. ప్రతిమ కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఈ సర్జ్‌పూల్, సొరంగమార్గం పనులను చేపట్టింది. సొరంగమార్గంలో పైకప్ప డ్రిల్లింగ్ చేస్తున్న సమయంలో 10 మీటర్ల పొడవు రాయి ఉన్నపళంగా కూలిపోయింది.దీంతో పని స్థలంలో ఉన్న 8 మంది ఆ శిథిలాల మధ్య చిక్కుకొనిపోయారు.వారిలో ఆరుగురు అక్కడికక్కడే మరణించారు.

మంత్రులు ఆదివారం ఉదయం తిరిగి సంఘటన స్థలానికి చేరుకుని, ఇంజనీరింగ్ అధికారులు,టన్నెల్ ప్రాజెక్టుకు బాధ్యత వహించే కాంట్రాక్టింగ్ ఏజెన్సీతో ఉన్నత స్థాయి సమీక్ష జరిపారు. సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

> **గత బీఆర్ఎస్ పాలనలో ఇరిగేషన్ రంగంలో పెద్దఎత్తున అవకతవకలు జరిగినట్టు, రూ.1.81 లక్షల కోట్లు వెచ్చించినా కీలకమైన ప్రాజెక్టులను పూర్తి చేయడంలో విఫలమైనట్టు విమర్శలు వస్తున్నాయి. దీంతో నల్గొండ,మహబూబ్‌నగర్ జిల్లాల్లో 103 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం నిరుపయోగంగా ఉంది.**

''ఎస్ఎల్‌బీసీ తవ్వకం జరుగుతున్నప్పుడు శ్రీశైలం నిండినప్పుడల్లా టన్నెల్‌లోకి నీళ్లు వచ్చి ముగిపోతుంటుంది. మళ్లీ వాటిని క్లియర్ చేయాల్సి వస్తుంది.అమ్రాబాద్ ప్రాంతమంతా పులుల అభయారణ్యం.పర్యావరణ సంఘాలు ఇది పర్యావరణ వ్యతిరేకమంటాయి. టన్నెల్‌లోకి గాలి, వెలుతురు వచ్చేలా ఏర్పాటు చేయటానికి వీలు లేకుండా పెట్టారు.టన్నెల్ రెండు చివర్ల నుంచి వచ్చే గాలి పీల్చుకుంటూనే లోపల కార్మికులు టన్నెల్ తవ్వాల్సి ఉంటుంది.ఇంకెన్ని ఏళ్లకు కంప్లీట్ కావాలి. ఇది ఎవరి పాపం.తెలంగాణ ప్రజలకు ఎందుకీ శిక్ష. సొరంగ తవ్వకంలో బోర్ చేసుకుంటూ వెనుక నుంచి లైనింగ్ చేసుకుంటూ వెళ్తారు.దాన్ని ఒకవేళ వెనక్కి లాగేద్దామంటే వెనుక చేసిన లైనింగ్ అంతా కూల్చేయాల్సిందే.ఇప్పుడు దాన్ని కొనసాగించటం తప్ప,గత్యంతరం లేని భయంకరమైన పరిస్థితిలో ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు కూరుకుపోయింది''అని కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నవేళ 2016 లో అసెంబ్లీలో వివరించారు.ఈ వీడియోను బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు వైరల్ చేస్తున్నది.

2004లోనే డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి ప్రభుత్వం ఎస్.ఎల్.బీ.సీ. ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. ఆ టన్నెల్ పనులు ఆలస్యంగా జరగటంతో 2016 వరకు కూడా పూర్తి కాలేదు.'అది ఒక డేంజరస్ ప్రాజెక్ట్' అని కేసీఆర్ తెలిపారు. ఇక అప్పటి నుంచి ఆ పనులు కొనసాగలేదు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ ఇటీవలే పనులు మొదలు పెట్టారు. పనులు మొదలు పెట్టిన నాలుగు రోజులకే టన్నెల్ పైకప్పు కూలటంతో రాజకీయ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.''బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పదేళ్ల పాటు పట్టించుకోలేదు. ఇప్పుడు మాత్రం బాధ్యతను తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు'' అని మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి,ఉత్తమ్ కుమార్ రెడ్డి,జూపల్లి,పొన్నం ప్రభాకర్ ఎదురుదాడికి దిగారు.

కాగా దక్షిణ తెలంగాణకు కేసీఆర్ హయాంలో తీవ్ర అన్యాయం జరిగిందని,తీరని ద్రోహం చేశారని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి,మంత్రులు ఉత్తమ్,కోమటిరెడ్డి పలుమార్లు ఆరోపించారు.ఉమ్మడి నల్గొండ జిల్లాలోని ఎస్ఎల్బీసీ సొరంగం ద్వారా నిండే రిజర్వాయర్స్ కెపాసిటీ 10 టీఎంసీలు,డిండి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్స్ రిజర్వాయర్స్ కెపాసిటీ 25 టీఎంసీలు, పాలమూరురంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ రిజర్వాయర్స్ కెపాసిటీ 65 టీఎంసీలు.ఈ మూడు ప్రాజెక్టులే కాకుండా కృష్ణా బేసిన్‌లోని వివిధ దశలలో ఉన్న ఇతర ప్రాజెక్టులను బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పట్టించుకోలేదు.ఫలితంగా దక్షిణ తెలంగాణలో కరువు పరిస్థితులు వచ్చాయని కాంగ్రెస్ పార్టీ నాయకులంటున్నారు.కేసీఆర్ హయాంలో పదేళ్ల పాటు వివిధ ప్రాజెక్టుల కింద భూసేకరణ కూడా చేయకుండా నిర్లక్ష్యం చేసినట్టు వాళ్ళ ఆరోపణ.కృష్ణా బేసిన్‌లోని కొన్ని ప్రాజెక్టులలో కాలువలు,డిస్ట్రిబ్యూటర్స్ నిర్మాణం అసంపూర్తిగా ఉండిపోయాయి. బేసిన్‌లోని సాగునీటి ప్రాజెక్టులు ముందుకు సాగకపోవడానికి కేసీఆర్,హరీశ్‌రావు ప్రధాన కారణమని కాంగ్రెస్ నాయకులు అఆరోపిస్తున్నారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చే మూడు సంవత్సరాలలో కృష్ణా బేసిన్‌లో ఉన్న ప్రాజెక్టలన్నింటినీ పూర్తిచేయాలని మంత్రులు అనుకుంటున్నారు.

గత బీఆర్ఎస్ పాలనలో ఇరిగేషన్ రంగంలో పెద్దఎత్తున అవకతవకలు జరిగినట్టు, రూ.1.81 లక్షల కోట్లు వెచ్చించినా కీలకమైన ప్రాజెక్టులను పూర్తి చేయడంలో విఫలమైనట్టు విమర్శలు వస్తున్నాయి.దీంతో నల్గొండ,మహబూబ్‌నగర్ జిల్లాల్లో 103 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం నిరుపయోగంగా ఉంది. ''తెలంగాణకు హక్కుగా ఉన్న కృష్ణా బేసిన్ వాటాను కోల్పోయాం.కేసీఆర్ పాలనలో అవినీతి, దుర్వినియోగంతో రైతులు నష్టపోయారు'' అని మంత్రి ఉత్తమ్ విమర్శించారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ రిజర్వాయర్ల నుంచి నీటి లభ్యత ఉన్నా, దక్షిణ తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులు సగంలో నిలిచిపోయాయి.

> **ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఫల్యమంటూ బిఆర్ఎస్ నాయకులు హరీశ్ రావు,కేటీఆర్ దుమ్మెత్తి పోస్తుండగా కాంగ్రెస్ నాయకులు,వాళ్లకు దీటుగా జవాబివ్వలేకపోతున్నారు. దీంతో ప్రభుత్వమే ఆత్మరక్షణలో పడినంతగా ప్రధాన ప్రతిపక్షం భారీ ప్రచారానికి శ్రీకారం చుట్టింది.**

గత పాలనలో అతిపెద్ద వైఫల్యాలలో పాలమూరురంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ఒకటన్నది కాంగ్రెస్ నాయకుల విమర్శ. అంజనగిరి, వీర్నంపల్లి,వెంకటాద్రి,కురుమూర్తిరాయ,ఉదండాపూర్,కేపీ లక్ష్మీదేవిపల్లి,పోతిరెడ్డిపల్లి,సింగరాజ్‌పల్లి,గొట్టిముకల,యర్రాపల్లిగోకవరం,డిండి,చింతపల్లి,కిస్తారంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్,శివన్నగూడెం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లను పూర్తిచేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతోంది.దక్షిణ తెలంగాణలో దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న ప్రాజెక్ట్ లను పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ చేపట్టింది.దశాబ్దకాలంగా గత ప్రభుత్వం లో వివక్షకు గురైన ప్రాజెక్ట్ ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయడానికి కాంగ్రెస్ సర్కార్ ప్రణాళికలు రూపొందిస్తున్నది.పైగా ప్రాజెక్ట్ ప్రారంభంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 2,292 కోట్ల అంచనా వ్యయంతో పనులు మొదలుపెట్టగా బీఆర్ఎస్‌ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురై పెరిగిన ధరలకు అనుగుణంగా పెరిగిన అంచనాలు రెట్టింపయ్యాయి. ఉద్దేశ్య పురంకంగానే కేసీఆర్ ప్రభుత్వం ఎస్ ఎల్ బీసీ ప్రాజెక్ట్ పై ఉదాసినత చూపెట్టిందన్న విమర్షలున్నాయి.

పెండింగ్ ప్రాజెక్ట్ లను పూర్తి చేయడానికి ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క,మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి,ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజాప్రతినిధులు నల్లగొండ జిల్లా దేవరకొండ కొండలో ఒక సమీక్ష సమావేశాన్నీ నిర్వహించారు. శ్రీశైలం ఎడమగట్టు కాలువ టన్నెల్ పనులతో పాటు డిండి ప్రాజెక్ట్, ఉదయ సముద్రం,పిల్లాయిపల్లి కాలువ, ధర్మారెడ్డి కాలువ,బునాదిగాని కాలువల పనులను సమీక్షించారు. 2005 లో అప్పటి ముఖ్యమంత్రి వై.యస్ రాజశేఖర్ రెడ్డి ఆమోదంతో రూ. 2,292 కోట్లకు పాలనా అనుమతులు పూర్తి చేసుకుని పనులు మొదలుపెట్టగా 2014 తరువాత ఈ ప్రాజెక్ట్ పనులు అటకెక్కాయి..2005 2014 వరకు కాంగ్రెస్ ప్రభుత్వంలో 1279.04 కోట్లు ఖర్చు చేసినట్లు కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఖర్చు పెట్టిన మొత్తాన్ని కలుపుకుంటే ఈ ప్రాజెక్ట్ పై రూ. 2,643.50 కోట్లు ఖర్చు చేశారు.తిరిగి అదే ప్రభుత్వం పెరిగిన ధరలకు అనుగుణంగా అంచనా వ్యయాన్ని రూ. 4,658.89 కోట్లకు పెంచిన ప్రతిపాదనల అనుమతుల కోసం ప్రభుత్వానికి 2023 డిసెంబర్ లో పంపించారు.ఆ తరువాత ఎన్నికలలో ఆ పార్టీ ఓడిపోయి కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఎస్.ఎల్.బి.సి.టన్నెల్ ప్రముఖంగా చర్చలోకి వచ్చింది.

కాళేశ్వరం ప్రాజెక్టు పదో ప్యాకేజీలో రాజన్న సిరిసిల్ల జిల్లా తిప్పాపూర్ వద్ద సొరంగ మార్గంలో 2017 లో జరిగిన ప్రమాదంలో ఏడుగురు ప్రాణాలు కోల్పోయిన విషయాన్ని కాంగ్రెస్ పార్టీ బలంగా ప్రచారంలోకి తీసుకువెళ్లలేకపోతోంది. మూడు గుట్టల మధ్య 92 మీటర్ల లోతు, 56 మీటర్ల డయాతో సర్జ్‌పూల్ అనే మహాబావిని,మిడ్ మానేరు నుంచి 3 కిలోమీటర్ల కాలువను,8 కిలోమీటర్ల సొరంగమార్గాన్ని నిర్మించారు. 9.5 మీటర్ల డయాతో రోజూ 11 వేల క్యూసెక్కుల నీరు ప్రవహించేవిధంగా సొరంగ మార్గాన్ని నిర్మించారు.దీని ద్వారా రోజు ఒక టీఎంసీ నీరు సర్జ్‌పూల్‌కు,అక్కడి నుంచి మల్లన్న సాగర్‌కు వెళ్తుంది.ప్రతిమ కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఈ సర్జ్‌పూల్, సొరంగమార్గం పనులను చేపట్టింది. సొరంగమార్గంలో పైకప్పు డ్రిల్లింగ్ చేస్తున్న సమయంలో 10 మీటర్ల పొడవు రాయి ఉన్నపళంగా కూలిపోయింది. దీంతో పని స్థలంలో ఉన్న 8 మంది ఆ శిథిలాల మధ్య చిక్కుకొనిపోయారు.వారిలో ఆరుగురు అక్కడికక్కడే మరణించారు.జార్ఖండ్ రాష్ట్రం రాంగఢ్ జిల్లా బార్లేంగా గ్రామానికి చెందిన పురంసింగ్,గడ్‌మా తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా పురం సింగ్ కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఫల్యమంటూ బిఆర్ఎస్ నాయకులు హరీశ్ రావు,కేటీఆర్ దుమ్మెత్తి పోస్తుండగా కాంగ్రెస్ నాయకులు,వాళ్లకు దీటుగా జవాబివ్వలేకపోతున్నారు.దీంతో ప్రభుత్వమే ఆత్మరక్షణలో పడినంతగా ప్రధాన ప్రతిపక్షం భారీ ప్రచారానికి శ్రీకారం చుట్టింది.

**రచనలకు ఆహ్వానం**

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.


మీ రచనలు పంపాల్సిన **చిరునామా:**
mahaapatrika@gmail.com
whatsapp-
7436939999

# రంగంలోకి ఉత్తరాఖండ్ బృందం

**హైదరాబాద్:** మూడు రోజులుగా ఆచూకీ కోసం అన్వేషణ ఆగలేదు. 8మంది జాడ కనిపెట్టేందుకు సైన్యం, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సింగరేణి రెస్క్యూ బృందాలు అలుపెరుగకుండా శ్రమిస్తూనే ఉన్నాయి. అయినా ఇప్పటికీ సానుకూలత కనిపించడం లేదు. ఇదీ ప్రస్తుతం శ్రీశైలం ఎడమగట్టు సొరంగం పైకప్పు కూలి ప్రమాద స్థలిలో నెలకొన్న పరిస్థితి. ఉత్తరాఖండ్‌లో జరిగిన విపత్తుల్లో రెస్క్యూ ఆపరేషన్లను విజయవంతంగా పూర్తిచేసిన బృందాలు సైతం పాలు పంచుకుంటున్నాయి. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. ప్రమాదంలో చిక్కుకున్న వారిని వెలికితీయడానికి కేంద్ర, రాష్ట్ర విపత్తు బృందాలతో పాటు ఆర్మీ, నేవి, సింగరేణి, కేంద్ర ప్రభుత్వ రహదారుల విభాగం, జేపీ, నవయుగలకు చెందిన సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఇప్పటివరకు ఏడు సార్లు టన్నెల్‌లో సహాయక బృందాలు తనిఖీలు నిర్వహించాయి. ఉత్తరాఖండ్‌లో జరిగిన విపత్తులలో రెస్క్యూ ఆపరేషన్‌లను విజయవంతంగా పూర్తిచేసిన బృందాలను రంగంలోకి దిగాయి. ఈ బృందంలో దాదాపు 584 నిపుణులైన సిబ్బంది ఉన్నారు. వీరితోపాటు 14 మంది ర్యాట్ హోల్ టీమ్స్ సేవలను ముమ్మరంగా ఉపయోగిస్తున్నారు. విరిగిన టీబీఎం భాగాన్ని బయటకు తీయాలని రెస్క్యూ టీం భావిస్తోంది. ఐతే ముక్కలైన పరికరాల కారణంగా వెలికితీతకు ఇబ్బంది ఏర్పడే అవకాశం ఉందని అంచనావేస్తున్నారు. బురదనీరు తొలగింపు తర్వాతే ప్రమాదస్థలికి చేరుకునే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. టన్నెల్‌లలో ఉన్న వారి ఆచూకీ తెలుసుకునేందుకు స్నిప్పర్ డాగ్స్‌లను కూడా రప్పించారు. అయితే, నీరు ఉన్నందున ఈ స్నిప్పర్ డాగ్స్ లోపలికి వెళ్లలేక పోయాయి. ఇప్పటికే డ్యామేజి అయిన కన్వేయర్ బెల్ట్‌కు మరమ్మత్తులు చేపట్టగా టన్నెల్ లోపలికి పై నుంచి రంధ్రం చేసి లోపలికి వెళ్లాలని భావించారు. ప్రతికూల పరిస్థితుల వర్టికల్ డ్రిల్లింగ్ ప్రతిపాదనను తోసిపుచ్చారు. 5 గ్యాస్ కట్టింగ్ మిషన్లు రేయింబవళ్లు పని చేస్తున్నాయి.

## క్షేమంగా రావాలని...

ఎస్ఎల్‌బీసీ సొరంగం వద్ద చిక్కుకున్న వారికోసం సహాయక చర్యలు నిర్విరామంగా అలుపెరగకుండా కొనసాగుతున్నాయి. 8 మంది ఆచూకీ కోసం ఎన్డీఆర్ఎఫ్ బృందాలతో పాటు పలు రెస్క్యూ సిబ్బంది క్షణం తీరక లేక చర్యలు చెపట్టాయి. సొరంగంలో చిక్కుకున్న వారి కుటుంబాల్లో రోదనలు మిన్నంటాయి. తమ సోదరుడు టన్నెల్ చిక్కుకుపోయిన విషయం తెలియగానే షాక్ గురయ్యామని ఓ కార్మికుడి సోదరుడు అరవింద్ సాహు ఆవేదన చెందుతున్నాడు. దాదాపు రెండున్నర సంవత్సరాలుగా సంస్థలో తన సోదరుడు విధులు నిర్వహిస్తున్నాడని ఇంతలో సొరంగంలో చిక్కుకోవడంతో క్షేమంగా రావాలని ఆకాంక్షిస్తున్నారు.





# మహా శివరాత్రికి భక్తులకు ఇబ్బందులు కలగొద్దు

- అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- రామప్పలో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ దివాకర టీఎస్

**ములుగు, మహా :** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని రామప్ప రామలింగేశ్వరుడి దర్శనానికి తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. యునెస్కో గుర్తింపు పొందిన ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం రామప్పలో సోమవారం ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 26 నుంచి జరిగే శివరాత్రి జాతరను పురస్కరించుకొని ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయడంతో పాటు పరిసరాలు శుభ్రంగా ఉండే విధంగా ప్రత్యేక పారిశుద్ధ కార్మికులను ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఏర్పాట్లు పూర్తయ్యాయని, అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. నిరంతరం విద్యుత్ సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పటు చేయడం జరిగిందని, మూడు రోజులలో 24గంటల పాటు వైద్య సిబ్బంది సేవలు అందిస్తారని, జాగారం చేసే భక్తుల కోసం రామప్ప పరిసర ప్రాంతాలలో ప్రత్యేక



ఎల్ఈడి స్క్రీన్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సాయంకాలం ఐదు గంటల అనంతరం రామప్ప సరస్సు కట్టపైకి ఎవరినీ అనుమతించవద్దని పోలీసు అధికారులను ఆదేశించారు. జాతరకు వచ్చే భక్తుల కోసం వాహనాల పార్కింగ్, మరుగుదొడ్ల ఏర్పాటుతోపాటు స్వచ్ఛమైన మంచినీటి అందించడానికి చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. అనంతరం భక్తుల కోసం ఏర్పాటుచేసిన క్యూలైన్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎం.సంపత్ రావు, ఆర్డిఓ వెంకటేష్, డీఎస్పీ రవీందర్, ఎండోమెంట్ ఈవో శ్రీనివాస్, డిఎంహెచ్ఓ గోపాల్ రావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- పోలింగ్ విధుల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలి
- పీఓలు,ఏపీఓల శిక్షణ తరగతుల్లో జిల్లా కలెక్టర్



**వరంగల్, మహా:** వరంగల్ ఖమ్మం నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సంబంధించి ఈ నెల 27న చేపట్టనున్న పోలింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా ' పారదర్శకంగా నిర్వహించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ డాక్టర్ సత్య శారద అదనపు కలెక్టర్ సంధ్యారాణి తో కలసి వరంగల్ ఖమ్మం నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల విధులకు నియమించబడిన పిఓ,ఏపిఓ, సూక్ష్మ పరిశీలకుల రెండవ శిక్షణ కార్యక్రమానికి హాజరై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పీఓలు, ఏపీఓల ను ఉద్దేశించి కలెక్టర్ కీలక సూచనలు చేశారు. శిక్షణ తరగతులను చక్కగా ఆకళింపు చేసుకుని ఎన్నికల విధులకు సంబంధించిన అన్ని అంశాలపై అవగాహన ఏర్పర్చుకోవాలని అన్నారు. ఇదివరకు నిర్వహించిన ఎన్నికల విధులే కదా అని శిక్షణ తరగతులను తేలికగా తీసుకోకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలకు సంబంధించిన ప్రతి ఒక్క అంశాన్ని తెలుసుకోవాలని సూచించారు. ప్రధానంగా అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలతో పోలిస్తే, శాసన మండలి ఎన్నికల పోలింగ్ ప్రక్రియ కొంత భిన్నంగా ఉంటుందన్నారు. బ్యాలెట్ పద్ధతిన జరిగే ఎమ్మెల్సీ పోలింగ్ ప్రక్రియలో ఓటింగ్ నిర్వహణకు



ఒకింత ఎక్కువ వ్యవధి పట్టే అవకాశాలు ఉన్నందున ఓపిగ్గా, సంయమనంతో వ్యవరిస్తూ సమర్ధవంతంగా విధులు నిర్వర్తించాలని హితవు పలికారు. 27వ తేదీన ఉదయం 8.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు పోలింగ్ సమయం ఉంటుందని, గడువు లోపు పోలింగ్ కేంద్రం పరిధిలో క్యూ లైన్ లో ఉన్న వారికి వరుస క్రమంలో టోకెన్ నెంబర్లు అందించి వారిచే ఓటింగ్ జరిపించాలన్నారు. పోలింగ్ కు ఒక రోజు ముందుగానే ఈ నెల 26వ తేదీన ఉదయం ప్రిసైడింగ్ అధికారులు తమ బృందంతో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు చేరుకోవాలని సూచించారు. పంపిణీ కేంద్రాల వద్ద అందించే పోలింగ్ సామాగ్రి, బ్యాలెట్ బాక్సులను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని, చెక్ లిస్ట్ లో పొందుపర్చబడిన దానికి అనుగుణంగా మెటీరియల్ అంతా కేటాయించబడినదా లేదా అన్నది జాగ్రత్తగా సరిచూసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పోలింగ్ సామాగ్రిని పరిశీలించుకున్న మీదట తమ బృందంతో కలిసి అధికార యంత్రాంగం సమకూర్చిన వాహనంలోనే నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ ఎంతో బాధ్యతాయుతంగా, జాగ్రత్తగా పోలింగ్ ప్రక్రియను జరిపించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఏ చిన్న తప్పిదానికి కూడా తావు లేకుండా పూర్తి పారదర్శకంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా పోలింగ్ ప్రక్రియ జరిగేలా సమర్ధవంతంగా విధులు నిర్వర్తించాలని హితవు పలికారు. నిర్లక్ష్యానికి తావిస్తూ, తప్పిదాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాల లోనికి సెల్ ఫోన్లు తీసుకెళ్లేందుకు అనుమతి లేదని స్పష్టం చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ముందస్తుగానే పోలింగ్ విధుల గురించి పరిపూర్ణమైన అవగాహన ఏర్పర్చుకోవాలని అన్నారు. డిస్ట్రిబ్యూషన్ రోజు బ్యాలెట్ బాక్సులు తీసుకొని, పోలింగ్ ప్రక్రియ ముగిసిన మీదట వాటిని నల్గొండ లోని రిసెప్షన్ సెంటర్ లో అప్పగించాల్సిన బాధ్యత ప్రిసైడింగ్ అధికారులదేనని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్సులను పీ.ఓలు తమ పర్యవేక్షణలో తమ వెంటే ఉంచాలని జాగ్రత్తలు సూచించారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నియమావళి ప్రకారంగా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పక్కాగా విధులు నిర్వహించాలన్నారు. ఓటర్లు, అభ్యర్థుల ఏజెంట్లు వివిధ అంశాలపై సందేహాలను లేవనెత్తే అవకాశాలు ఉన్నందున వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత పి.ఓలదే అని అన్నారు. పోలింగ్ పూర్తయిన అనంతరం పక్కాగా రికార్డు బుక్కులలో వివరాలను పొందుపరుస్తూ నివేదిక తయారు చేయాలని సూచించారు. ఎలాంటి సందేహాలు ఉన్నా, శిక్షణ తరగతుల్లో మాస్టర్ ట్రైనర్లను అడిగి నివృత్తి చేసుకోవాలని హితవు పలికారు. ఈ సందర్భంగా పోలింగ్ డే సందర్భంగా పి.ఓ లు, ఏ.పీ.ఓలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిర్వర్తించాల్సిన బాధ్యతల గురించి మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి డిఆర్ఓ విజయలక్ష్మి,, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, ట్రైనింగ్ నోడల్ అధికారి బాలకృష్ణ, సూపరింటెండెంట్ రంజిత్, ఎన్నికల శిక్షకులు,పిఓలు ఓపీవోలు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ని ఏఐలు వచ్చినా... ఐదుగురు మనుషులతో సమానం కాదు

- ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు నందన్ నీలేకని
- అన్ని రంగాల్లోనూ ఏఐ హవా
- ఏఐతో యాంత్రీకరణ తప్ప, సృజనాత్మకత ఉండదన్న నందన్ నీలేకని
- ఏఐ సృష్టించలేదు... అనుకరిస్తుందంటూ ఒక్క మాటలో తేల్చేసిన వైనం

**మహా :** ఇప్పుడు దాదాపు ప్రతి రంగాన్ని ఏఐ (కృత్రిమ మేధ) టెక్నాలజీ శాసించే పరిస్థితి నెలకొంది. ఏఐతో పనులు సులువుగా నెరవేరుతుండడంతో, ప్రభుత్వాలు సైతం ఈ దిశగా అడుగులు వేస్తున్నాయి. అయితే, ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని ఆలోచనలు మరోలా ఉన్నాయి. మీరు ప్రపంచంలోని ఏఐలు అన్నింటినీ తీసుకురండి కానీ ఐదుగురు మనుషులు కలిసి పనిచేసిన దాంతో సమానం కాదు అని అన్నారు. ఏఐ కంటే మానవ మేధ గొప్పదని మీరే అంటారు అని వ్యాఖ్యానించారు. బొత్తిగా తెలియని సాంకేతిక నైపుణ్యాల కోసం పాకులాడడం కంటే, ఏఐ ప్రతిఫలించలేని స్వీకరణ సామర్థ్యాలను అభివృద్ధి చేయడంపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ఏఐ ఎంతో యాంత్రికమైన వ్యవస్థ అని, ఇది మానవ శక్తిని పూర్తిగా భర్తీ చేయలేదని అభిప్రాయపడ్డారు. టెక్నాలజీ ఎంత అభివృద్ధి చెందినా, మనిషికి మాత్రమే సాధ్యమైన అంశాలు కొన్ని ఉంటాయని, పరస్పర సహకారం, సృజనాత్మకత, సానుభూతి, నాయకత్వం వంటి విషయాల్లో మానవ శక్తిని ఏఐ అధిగమించలేదని నందన్ నీలేకని వివరించారు. ఏఐ ఎంత యాంత్రికంగా మారుతుందో, మానవ గుణాలు అంత విలువైనవిగా మారతాయని పేర్కొన్నారు. ఏఐ ఎప్పుడూ సృష్టించలేదని, కేవలం అనుకరిస్తుందని నందన్ నీలేకని ఒక్క మాటలో తేల్చేశారు.

# పాస్‌బుక్కుల కోసం "రైతుల" పాదయాత్ర

- సీపీఎం ఆధ్వర్యంలో నిరసన, ధర్నా కార్యక్రమం
- న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు: సీపీఎం నేత యాదయ్య
- పూర్తి స్థాయిలో రికార్డులను పరిశీలించి రైతులకు న్యాయం చేస్తాం
- అబ్దుల్లాపూర్ మెట్ తహశీల్దార్ సుదర్శన్ రెడ్డి



అబ్దుల్లాపూర్మెట్, మహా: రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్ మెట్ మండలం అనాజ్పూర్ గ్రామ బాధిత రైతులు అనాజ్పూర్ నుంచి అబ్దుల్లాపూర్ మెట్ తహసీల్దార్ కార్యాలయం వరకు రైతులు పాదయాత్ర చేశారు. అనంతరం తహసీల్దార్ ఆఫీసు వద్ద నిరసన ధర్నా కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ సుదర్శన్ రెడ్డికి మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పగడాల యాదయ్య మాట్లాడుతూ... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 1991 సంవత్సరంలో అనాజ్పూర్ గ్రామ రెవెన్యూ సర్వే నెంబర్ 274 ,275 ,276, 277, 278, 281 సీలింగ్ భూమిలో 125మందికి 125 ఎకరాలు పట్టా పాస్ బుక్కులు ఇచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దరిద్రమైన "ధరణి" తీసుకొచ్చి.. ఆ రైతులకు కొత్త పట్టాబుక్కులు ఇవ్వలేదు... ఆన్లైన్లో కూడా ఎక్కించలేదన్నారు. అనాజ్ పూర్ రైతులకు పట్టా పాస్ బుక్కులు ఇచ్చి.. వారికి న్యాయం చేసే వరకు ఎర్రజెండా అండగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి వారికి పట్టా పాసుబుక్కులు ఇవ్వాలని డిమాండ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం అబ్దుల్లాపూర్మెట్ మండల కార్యదర్శి ఏర్పుల నర్సింహా, ముత్యాలు శ్రీను, బాలరాజ్ గుండె శివ, ఎం. లింగస్వామి, రైతులు మహేష్, రవి, భిక్షపతి, రాములు, శ్రీనివాస్ ,రైతులు పాల్గొన్నారు. అనాజ్పూర్ గ్రామ రైతుల సమస్యను పూర్తి స్థాయిలో రికార్డులను పరిశీలించి.. ఆ రైతుల సమస్యలను త్వరలో పరిష్కరించి వారి తగు న్యాయం చేస్తానని అబ్దుల్లాపూర్మెట్ తహశీల్దార్ రైతులకు హామీనిచ్చారు.

## ప్రజావాణి వినతుల పరిష్కారం పై దృష్టి సారించండి

**వరంగల్, మహా:** ప్రజా వినతుల పరిష్కారం పై దృష్టి సారించాలని బల్దియా కమిషనర్ డా. అశ్విని తానాజీ వాకడే అన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని పురస్కరించుకొని బల్దియా ప్రధాన కార్యాలయం లోని కౌన్సిల్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజల నుండి స్వీకరించిన దరఖాస్తు లను పరిష్కార నిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా స్వీకరించిన ఫిర్యాదుల వివరాలు విభాగాల వారిగా ఇంజనీరింగ్....13, హెల్త్ & సానిటేషన్.....08, ప్రాపర్టీ టాక్స్(రెవెన్యూ)...10, టౌన్ ప్లానింగ్....33, మంచినీటి సరఫరా.......01, మొత్తం....65 గా అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా ఎస్ఈ ప్రవీణ్ చంద్ర సి ఎం హెచ్ ఓ డా.రాజారెడ్డి, బయలజిస్ట్ మాధవ రెడ్డి హెచ్ ఓ లు రమేష్, లక్ష్మారెడ్డి ఇన్చార్జి సి పి రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్లు పాల్గొన్నారు.

# జిల్లాలో కేంద్ర పథకాలు సమర్థవంతంగా అమలు

- 7వ కామన్ రివ్యూ మిషన్ బృందం
- మహిళా సంఘాల కార్యక్రమాలు బేష్

**రంగారెడ్డి జిల్లా, మహా:** జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ తో 7వ కామన్ రివ్యూ మిషన్ బృందం సభ్యుల సమావేశం. భారత ప్రభుత్వం కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 7వ కామన్ రివ్యూ మిషన్ బృంద సభ్యులు డాక్టర్ ఎం సి పాల్, డాక్టర్ జావేద్ ఇక్బాల్ ఖాన్, డాక్టర్ వికాస్ కుమార్, డాక్టర్ అభిజిత్ దాస్, ఈనెల 22 నుండి 24 వరకు రంగారెడ్డి జిల్లాలో పర్యటించారు. పలు కేంద్ర ప్రయోజత పథకాలు ముఖ్యంగా ఉపాధి హామీ పథకం, NRLM మిషన్ అంత్యోదయ, 14th& 15th ఫైనన్స్ కమిషన్ పథకాల క్రింద చేపట్టిన పలు కార్యక్రమాల పనుల అమలును పరిశీలించారు.



PMGSY, PMAY, NSAP, GPDP, DDU GKY & RSETI జిల్లాలో కందుకూరు మండలం రాచూలూరు, తిమ్మాపూర్ గ్రామాలలో ఉపాధి హామీ మరియు పింఛన్ పథకాలను పరిశీలించినారు. PMGSY పనులు లేమూరులో పరిశీలించినారు. ఆమనగల్ PMGSY, కడ్తాల్ PMFME, PMAY మోడల్ హౌస్ లను పరిశీలించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో, జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ తో 7వ కామన్ రివ్యూ మిషన్ బృంద సభ్యులు సమావేశమై వారి పర్యటనలో పరిశీలించిన అంశాలు వివరించి, జిల్లాలో కేంద్ర ప్రయోజిత పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నారని అభినందించారు. ముఖ్యంగా ఉపాధి హామీ పథకం, మహిళా సంఘాలు ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు ఆదర్శవంతంగా ఉన్నాయన్నారు. తదుపరి, జిల్లా మహిళా సమైక్య సమావేశములో పాల్గొని వివరాలు తెలుసుకొన్నారు. మరియు ముచ్చింతల ఆర్ఎస్ఈటిఐ శిక్షణ కార్యక్రమాలు పరిశీలించి, మహిళా సంఘాల యొక్క ఉత్పత్తులను సందర్శించారు. ఇట్టి కార్యక్రమములో, డిఆర్డిఓ, సీఈఓ జెడ్పిపి, డిపిఓ, పిడి, హౌసింగ్, పిఆర్ ఇంజనీరింగ్ ముఖ్యులు, ఈజీఎస్, సెర్ప్, రాష్ట్ర ముఖ్యులు పాల్గొన్నారు.

## కుంభమేళాలో కార్పొరేటర్ దంపతులు



**వరంగల్, మహా:** 144 సంవత్సరాల తరువాత వచ్చిన కుంభమేళాలో పవిత్ర ప్రయాగ్ రాజ్ గంగ,యమునా, సరస్వతీ పవిత్ర నదిలలో పుణ్య స్నానం ఆచరించి సనాతన ధర్మాన్ని అనుసరించి ప్రజలందరూ బాగుండాలని ఆ భగవంతుడిని ప్రార్థించడం జరిగిందని గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలోని 28వ డివిజన్ కార్పొరేటర్ గందె కల్పన నవీన్ దంపతులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రయాగరాజ్ పవిత్ర త్రివేణి సంగమం లోని నదిజలాలను 100 లీటర్ల కు పైగా వరంగల్ నగరానికి తీసుకు వచ్చి మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పంపిణీ కార్యక్రమం జరుగుతుందని కావున ఈ కార్యక్రమంలో పాల్గొనాలని గందె కల్పన నవీన్ దంపతులు కోరారు.

# వన్యప్రాణుల సంరక్షణకు కట్టుబడి ఉన్నాం

**8వ రాష్ట్ర వన్యప్రాణుల సంరక్షణ బోర్డు సమావేశంలో మంత్రి కొండా సురేఖ**



**సమావేశం చివర్లో బోర్డు సభ్యుల సూచనలను మంత్రి కొండా సురేఖ అభినందించారు. ఈ సమావేశంలో ఎన్ బిడబ్లుఎల్ సభ్యులు, ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, రామ్‌దాస్ నాయక్, ముఖ్య కార్యదర్శి నదీమ్, పిసిసి ఎఫ్ దోబ్రియాల్, ఎలు సింగ్, మంత్రి పీఎస్ ఎం ఎం ఎస్ ఎస్ సోమరాజు, ఓ ఎస్ డి సుమంత్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.**

**వరంగల్, మహా:** అటవీ, పర్యావరణ & దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధ్యక్షతన సోమవారం రాష్ట్ర సచివాలయంలో 8వ రాష్ట్ర వన్యప్రాణుల సంరక్షణ బోర్డు ఎస్ బి డబ్ల్యు ఎల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వన్యప్రాణుల సంరక్షణ, అటవీ, పర్యావరణ పరిరక్షణ అంశాలకు సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ వన్యప్రాణుల సంరక్షణ విషయంలో ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉందని స్పష్టం చేశారు. అటవీ, జీవవైవిధ్య నిర్వహణ మెరుగుపరిచే దిశగా నిపుణుల సూచనలను ఆమె స్వాగతించారు. 7వ ఎస్ బి డబ్ల్యూ ఎల్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుపై సమీక్షించిన మంత్రి.. జాతీయ వన్యప్రాణుల సంరక్షణ మండలి ఎన్ బిడబ్లుఎల్ సమీక్షకు పంపిన పలు రాష్ట్ర ముఖ్య ప్రాజెక్టులపై ఆరా తీసారు. సమావేశంలో ప్రధాన అటవీ సంరక్షణాధికారి మాట్లాడుతూ 1972 వన్యప్రాణుల సంరక్షణ చట్టం ప్రకారం రాష్ట్ర వన్యప్రాణుల సంరక్షణ బోర్డు ఏర్పాటు తప్పనిసరిగా జరగాల్సిన అంశమని వివరించారు. జీవో .ఎంఎస్. నెంబర్ 52, 02.12.2024 ద్వారా తెలంగాణలో అధి



కారికంగా ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు.

**సమావేశంలో తీసుకున్న ప్రధాన నిర్ణయాలు**

1. పోచారం వన్యప్రాణుల అభయారణ్యం నుంచి వెళ్లే మెదక్‌యల్లారెడ్డి రహదారి విస్తరణకు అనుమతి మంజూరు.
2. అటవీ ప్రాంతాల్లో ఓ ఎఫ్ సి లైన్ల ఏర్పాటు ప్రతిపాదనలపై చర్చ.
3. ములుగులో 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం, నాగార్జునసాగర్ డివిజన్‌లో పెద్దగట్టు ఎత్తిపోతల పథకానికి అనుమతి.
4. యానిమల్ పాసేజ్‌ల మార్పుల కోసం 18 ప్రతిపాదనలు, మొబైల్ టవర్ల కోసం 13 ప్రతిపాదనలపై సమీక్ష ఎన్ బిడబ్లుఎల్ కి పంపే ముందు అవసరమైన సవరణలపై చర్చ.
5. మీసేవ ద్వారా యానిమల్‌మ్యాన్ కాంఫ్లిక్ట్ బాధితులకు పరిహారం చెల్లించడానికి కార్పస్ నిధి గురించి చర్చించారు.
6. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌ల నుంచి 1,088 కుటుంబాల పునరావాసం వివరాల పై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్న మంత్రి.
7. కమ్యూనిటీ ఆధారిత ఎకో టూరిజం ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష. అలాగే కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లో భారీ వాహనాల రాకపోకలపై నిషేధాన్ని తొలగించే అంశాల పరిశీలన.
8. రాష్ట్రవ్యాప్తంగా జంతు ప్రదర్శనశాలలు, జాతీయ పార్కులు, ఇంకా పట్టణ పార్కుల అభివృద్ధి కోసం ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాలని మంత్రి సూచన. స్థానిక సేంద్రీయ చెట్లను ప్రాధాన్యతగా పెంచి, సహజ అటవీ వ్యవస్థను పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

# చోరీలకు పాల్పడుతున్న దంపతుల అరెస్ట్

- తెలుగు రాష్ట్రాల్లో పలు దొంగతనాలు..చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు



**మిర్యాలగూడ, మహా :** ఉమ్మడి నల్గొండ జిల్లాతో సహా... ఏపీలోని గురజాల, రెంటచింతల ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్న దంపతులైన మోస్ట్ వాంటెడ్ అంతరాష్ట్ర దొంగలను సోమవారం మిర్యాలగూడ టూ టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. టూ టౌన్ సీఐ, నాగార్జున, రూరల్ సీఐ వీరబాబు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అంతరాష్ట్ర దొంగలుగా ఉన్న దంపతులపై నమోదు చేసిన కేసుల వివరాలను వెల్లడించారు. డీఎస్పీ రాజశేఖర రాజు పర్యవేక్షణలో ...దొంగలను పట్టుకుని నిఘా పెంచినట్టు తెలిపారు. ఈ క్రమంలో నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని సుందర్ నగర్ కు చెందిన....వేముల కోటేష్ పై 2010 నుంచి 2024 మార్చి వరకు ఉమ్మడి నల్లగొండ జిల్లా లోని సుమారు 20 పోలీస్ స్టేషన్లతో పాటు ఏపీలోని గురజాల, రెంటచింతల పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదై ఉన్నట్లు చెప్పారు. ఈ క్రమంలో మిర్యాలగూడ రూరల్, టూటౌన్, వన్ టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధి చెందిన కేసులలో 2024 మార్చిలో కోటేష్, కృష్ణవేణి దంపతులను అరెస్ట్ రిమాండ్ కు పంపినట్టు చెప్పారు. అయితే అదే ఏడాది జూలై నెలలో జైలు నుంచి విడుదలై కొద్ది రోజులపాటు కూలి పనులకు వెళ్లినప్పటికీ... వచ్చే సంపాదన సరిపోక రైళ్లలో బస్సులలో తిరుగుతూ మళ్లీ దంపతులు దొంగతనాలకు పాల్పడినట్లు చెప్పారు. జైలు నుంచి విడుదల అయ్యాక ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరిలో ... మిర్యాలగూడ, హాలియా, నకిరేకల్, దేవరకొండ, డిండి, హుజూర్ నగర్ ప్రాంతాల్లో పట్టపగలే తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ దొంగతనాలు చేసినట్టు చెప్పారు. సదరు కోటేష్ రెక్కీ చేసి భార్యను ... స్థానికుల రాకను గమనించే విధంగా భార్యను కాపాలాగ పెట్టి ... కోటేష్ ఇంట్లోకి దొంగతనాలు చేసినట్టు చెప్పారు. కోటేష్ పై 37, కృష్ణవేణి పై 10 కేసులు ఉన్నట్లు చెప్పారు. నిందితుల నుంచి 97.9 గ్రాముల బంగారం, ఐటెల్ స్మార్ట్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసును చేదించిన మిర్యాలగూడ టూ టౌన్, రూరల్ సీఐ నాగార్జున, వీరబాబు, ఎస్ఐ లు రాంబాబు, పి. వెంకటేశ్వర్లు, పీసీలు ఎండి. అక్బర్, ఎం. రామకృష్ణ ను డీఎస్పీ అభినందించారు.

## అనుమానాస్పద స్థితిలో ఒకరు మృతి..

- మరొకరి పరిస్థితి విషమం
- వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు

**మిర్యాలగూడ, మహా:** మద్యం సేవించిన మిత్రులలో రక్తపు వాంతులతో ఒకరు మృతి చెందగా... మరొకరు కొన ఊపిరితో పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అనుమానాస్పద సంఘటన మిర్యాలగూడ పట్టణంలో సోమవారం వెలుగు చూసింది.... భర్త మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ భార్య వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. బాధితులు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. పట్టణంలోని వినోబా నగర్ కు చెందిన కోడి రెక్క సంపత్ కుమార్ (32) ప్రైవేట్ సంస్థలో ఫైనాన్స్ రికవరీ ఏజెంట్ గా పని చేస్తుంటాడు. ఆదివారం రాత్రి అతని మిత్రులైన ఆర్ఎంపీ ఎండి గౌస్ అలీ, యశ్వంత్, గురజాల బాలరాజు, పొదిల అన్వేష్ లు కలిసి ముత్తిరెడ్డి కుంటలోని ఓ బెల్ట్ షాపులో మద్యం సేవించినట్టు తెలిపారు. అనంతరం కోడి రెక్క సంపత్, గౌస్ అలీలు అర్ధరాత్రి విపరీతంగా రక్తపు వాంతులు చేసుకోవడంతో గమనించిన కుటుంబ సభ్యులు తొలుత మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రి కి,ఆపైన మిర్యాలగూడ లోని ప్రైవేట్ ఆస్పత్రి లలో చేర్పించారు. కాగా చికిత్స పొందుతూ కోడి రెక్క సంపత్ మృతి చెందగా, గౌస్ అలీ అపోలో ఆస్పత్రిలో వెంటిలేటర్ పై చికిత్స పొందుతున్నాడు. కాగా సంపత్ కుమార్ మృతి పై భార్య రమ్య పలు అనుమానాలు వ్యక్తం చేస్తూ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. సంపత్ భార్య రమ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్ టౌన్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

# ఒక్కసారిగా పెరిగిన మటన్ ధరలు

- బర్డ్ ఫ్లూ తో తగ్గిన చికెన్ ధరలు
- నాన్ వెజ్ ప్రియులను దోచుకుంటున్న వైనం



**తొర్రూరు, మహా :** మండల కేంద్రంలో ఒక్కసారిగా మటన్ ధరలు కొండెక్కాయి.ఇటీవల కోళ్లకి బర్డ్ ఫ్లూ వైరసుల వల్ల పెద్ద సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడుతున్నాయని వార్తలతో చికెన్ డిమాండ్ ఒక్కసారిగా తగ్గిపోయింది. ఆదివారం వస్తే చికెన్ షాపుల ముందు మాంస ప్రియులు క్యూలో నిలబడే పరిస్థితి ఉండేది. కానీ ఈ ఆదివారం చికెన్ దుకాణాలు నాన్ వెజ్ ప్రియులు లేక చిక్కి పోయాయి. కోళ్ళకి వైరసులు వస్తున్నాయి అన్న విషయం తెలుసుకున్న జనం ఎందుకైనా మంచిది అని మటన్ దుకాణాల వైపు మొగ్గుచూపుతున్నారు. ఇదే అదునుగా చేసుకున్న మటన్ షాపులు ఒక్కసారిగా రూ.800వందల నుంచి రూ.1000 వరకు పెంచి దండిగా సొమ్ము కూడ పెట్టుకుంటున్నారు.ప్రస్తుతం మార్కెట్‌లో రోజురోజుకి పెరుగుతున్న మటన్ ధర ప్రజలను తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. ప్రత్యేకంగా మధ్య తరగతి ప్రజలు పెరుగుతున్న ధరల కారణంగా మటన్ కొనుగోలు చేయడాన్ని తగ్గించుకుంటున్నారు. గత కొన్ని రోజులుగా ధరలు స్థిరంగా ఉండకపోవడం, డిమాండ్ పెరగడం వంటి అంశాలు ఇందుకు ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. మటన్ ధరలు సాధారణ వినియోగదారుల పై భారం వేస్తూ, వారికి ఆర్థికంగా కొత్త సవాళ్లను పెంచుతోంది.

# మంచిర్యాలలో సీయం ను కలిసిన కంది శ్రీనివాస రెడ్డి





**ఆదిలాబాద్ మహా :** ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మంచిర్యాల పర్యటనకు విచ్చేసిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి కలిసారు.నియోజకవర్గం లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం గురించి , నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు విషయాలపై మాట్లాడారు.కంది శ్రీనివాస రెడ్డి తన మొబైల్ లో తయారు చేసిన రిప్రంజంటేషన్ చూసి సీయం మెచ్చుకున్నారు.అనంతరం సీయం బహిరంగా సభలో కంది శ్రీనివాస రెడ్డి ప్రసంగించారు.



## సింగిల్ విండోలో సభ్యత్వం ఇవ్వడం లేదని రైతు నిరసన

**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలంలోని రైతు సేవా సహకార సంఘం ఎదుట బండకొత్తపల్లి గ్రామ రైతు గోపాలదాసు బిక్షం నిరసన తెలిపారు ఏడాది కాలంగా తిప్పుకుంటున్న సంఘం సీఈవో నాగయ్య యాదాద్రి డీసీవో చెప్పినా లెక్క చేయని సీఈవో సభ్యత్వం ఇవ్వవద్దని పాలకవర్గం తీర్మానం చేసిందని చెబుతున్న సీఈవో నాగయ్య రూల్స్ జాన్తానై. స్వంత చట్టం అమలు చేస్తున్నాడని సీఈవో పై రైతు ఆరోపణ చేశాడు రైతుకు సభ్యత్వం ఇవ్వక పోవడం పై డీసీవో ఆగ్రహం వివరాల కోసం సమాచార హక్కు చట్టం ద్వారా కోరగా సమాచారం ఆలస్యంగా ఇవ్వడమే కాకుండా సహకార సంఘాలు సమాచార హక్కు చట్టం పరిధిలోకి రావని సుప్రీంకోర్టు తీర్పు ఉందని తప్పుడు సమాచారం ఇస్తున్నారని అన్నారు,

# పోలీసుల ఎదుట లొంగిపోయిన మావోయిస్టు డివిజన్ కమిటీ సభ్యురాలు

- కేంద్ర కమిటీ సభ్యుడు దివంగత కటకం సుదర్శన్ భార్య పద్మ
- రివార్డు అందజేసిన ఎస్పీ డాక్టర్ శబరీష్



**ములుగు, మహా :** నిషేధిత మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడు దివంగత కటకం సుదర్శన్ అలియాస్ ఆనంద్ భార్య, డివిజన్ కమిటీ సభ్యురాలు పుల్సం పద్మ అలియాస్ ఊరె, అలియాస్ గంగక్క సోమవారం ములుగు పోలీసుల ఎదుట లొంగిపోయారు. అందుకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పీ డాక్టర్ పి.శబరీష్ మీడియాకు వివరించారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకుల గూడెం గ్రామానికి చెందిన పుల్సం పద్మ తల్లిదండ్రులకు నలుగురు కూతుళ్లలో పెద్ద కుమార్తె. దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న తుపాకులగూడెంకు ఏటూరునాగారం దళం తరుచూ వచ్చి వెళ్తూ ఉండేది. సాంస్కృతిక కార్యక్రమాలకు ఆకర్షితురాలై ప్రేరణ పొందిన పద్మ 1998లో సీపీఐ ఎంఎల్ పీడబ్ల్యూజీలో చేరి సభ్యురాలిగా పనిచేసింది. 2001, 2004 వరకు మహిళా దళంలో పనిచేసి 2005లో దళ కమాండర్ గా నియమితురాలైంది. అదే ఏడాదిలో సెంట్రల్ కమిటీ సభ్యుడు కటకం సుదర్శన్ ను పెళ్లి చేసుకుంది. 2007లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఒత్తిళ్ల కారణంగా ఆనంద్ తో కలిసి దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ కి బదిలీపై వెళ్లారు. ఏరియా కమిటీ సభ్యురాలిగా పదోన్నతి పొంది కటకం సుదర్శన్ రక్షణ విభాగంలో డిప్యూటీ కమాండర్ గా పనిచేసింది. తెలంగాణ, ఛత్తీస్గఢ్ రాష్ట్రాల్లో అనేక హింసాత్మక ఘటనల్లో పాల్గొన్న పద్మ మూడుసార్లు ఎదురు కాల్పుల్లో పాల్గొంది. 2024జూలైలో బైక్ పై నుంచి పడిన పద్మ ఎడమచేతికి తీవ్ర గాయం కావడంతో పాటు ఆరోగ్య సమస్యలు పెరిగాయి. తెలంగాణ ప్రభుత్వ పునరావాస కార్యక్రమాలవైపు ఆకర్షితురాలైన పుల్సం పద్మ లొంగుబాటుకు నిర్ణయించుకొని సోమవారం ములుగు ఎస్పీ ఎదుట లొంగిపోయారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజలు మావోయిస్టు సిద్ధాంతాన్ని తిరస్కరించారని, క్యాడర్లు అస్త్రాలను వదిలి జనజీవన స్రవంతిలో చేరాలని విజ్ఞప్తి చేశారు. కాగా, జిల్లా ఎస్పీ శబరీష్ మాట్లాడుతూ.. నిషేధిత మావోయిస్టు పార్టీలో సీనియర్ క్యాడర్లు వయసు సహకరించక తీవ్ర అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిసిందని, మావోయిస్టులు పునరావాస కార్యక్రమంలో భాగంగా ములుగు జిల్లా పోలీసుల ఎదుట లొంగిపోవాలని పిలుపునిచ్చారు. లొంగిపోయిన వారికి రివార్డ్‌తో పాటు, పునరావాసం కల్పించి అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎస్పీ తెలిపారు. కాగా లొంగిపోయిన మావోయిస్టు సభ్యురాలు పద్మకు రివార్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఓఎస్డీ గీతే మహేష్ బాబాసాహెబ్, డీఎస్పీ ఎన్.రవీందర్, తదితరులు పాల్గొన్నారు.


## చిన్నారులను క్రీడల్లో పాల్గొనే విధంగా ప్రోత్సహించాలి



ఎస్సై ముత్తయ్య

**హుజూర్ నగర్, మహా:** విద్యార్థులను చిన్ననాటి నుండే క్రీడల్లో పాల్గొనే విధంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని ఎస్సై ముత్తయ్య అన్నారు. హుజూర్ నగర్ పట్టణంలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో ప్రీ ప్రైమరీ విద్యార్థులకు సోమవారం నిర్వహించిన స్పోర్ట్స్ డే కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరికి వ్యాయామం అవసరమని దానిద్వారా శారీరకంగా, మానసిక ఉల్లాసంగా ఉండొచ్చని అన్నారు. విద్యార్థులు మార్చ్ ఫాస్ట్ ద్వారా ముఖ్యఅతిథికి ఘనస్వాగతం చెప్పారు. అనంతరం విద్యార్థులు మార్చ్ ఫాస్ట్ లో పాల్గొని ముఖ్య అతిథులకు గౌరవ వందనం చేశారు. విద్యార్థులతో కలిసి ఎస్సై క్రీడాజ్యోతిని వెలిగించారు. విద్యార్థులకు జరిగిన పలు క్రీడల్లో ఆనంద ఉత్సవాల నడుమ ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పోసాని వెంకటరమణారావు, డీన్ ప్రేమ్ సాగర్, ఇన్చార్జిలు సంధ్య, నాగకన్య, ఉపాధ్యాయులు మమత, నాగమల్లేశ్వరి, సునీత, నందిని, లక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అలరించిన పాటల పోటీలు



**హుజూర్ నగర్, మహా:** హుజూర్నగర్ పట్టణంలో టౌన్ హాల్ నందు స్పందన కళామండలి వారి ఆధ్వర్యంలో ఎస్పీ బాలసుబ్రమణ్యం జ్ఞాపకార్థంగా పాటల పోటీలు నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుండి పాటల పోటీలలో పాల్గొనుటకు గాయని,గాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కోతి సంపత్ రెడ్డి విచ్చేసి మాట్లాడుతూ ఇంత పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని నిర్వహించినటువంటి స్పందన నాట్య కళా మండలి వారికి అభినందనలు తెలియజేస్తూ కీర్తిశేషులు బాలసుబ్రమణ్యం వారు అందించిన పాటల రూపంలో ఎప్పటికీ సజీవంగానే ఉంటారు అని, అంతరించిపోతున్న కళ రంగాన్ని కాపాడ్డానికి నిరంతరం కృషి చేస్తున్న స్పందన నాట్య మండలి అధ్యక్షుడు కొట్టు బాబు ప్రధాన కార్యదర్శి ధూళిపాల రామకృష్ణ, ప్రచార కార్యదర్శి వెంకటేశ్వర్లుకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. నిర్వాహకులు స్పందన నాట్య కళామండలి అధ్యక్షులు కొట్టు లక్ష్మీనారాయణ బాబు మాట్లాడుతూ పాటల పోటీలలో గాయకులు 90 మంది పాల్గొన్నారని ఈ పోటీలలో విజేతలకు మొదటి బహుమతి కె ఎమ్ నాయుడు(వైజాగ్) రూ.10.000, రెండవ బహుమతి జి రాజ్ కుమార్ (చిలకలూరిపేట) రూ.8.000 మూడవ బహుమతి రాజు (తణుకు)రూ.6.000 నాల్గవ బహుమతి చేబ్రోలు శ్రీనివాసచారీ (నాగర్జున సాగర్) రూ.4.000 ఎమ్ మాధవీ (విజయవాడ) ఐదవ బహుమతి రూ.2.000, 5 గురికి జ్యూరీ, 10 మందికి కన్సోలేషన్ తోపాటు 12 ప్రత్యేక బహుమతులు విజేతలకు అందజేసినట్లు కొట్టు బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పందన నాట్య కళామండలి గౌరవ అధ్యక్షులు గొట్టె రామయ్య, మాజీ వైస్ చైర్మన్ కోతి సంపత్ రెడ్డి, మాజీ ఎంపిపి గూడెపు శ్రీనివాస్, పెద్దిరెడ్డి గణేష్, కీత మల్లికార్జున్, కళాకారుడు పుల్లయ్య, గోపు చలీనమ్మ ధూళిపాళ రామక్రిష్ణ ప్రసాద్, గోపనబోయిన వేంకటేశ్వర్లు, ములకలపల్లి సీతయ్య, చిమట సైదులు, రౌత్ వేంకటేశ్వర్లు, కోలశ్రీను, చిలకరాజు లింగయ్య, నలమాధ శ్రీనివాస్, యరగాని గోపాలం కళాకారులు కళాభిమానులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఝాన్సీ రెడ్డి



**తొర్రూరు, మహా:** తొర్రూరు మండలం రెడ్డి గార్డెన్లో చెర్లపాలెం గ్రామానికి చెందిన కర్ర జనార్ధన్ రెడ్డి కుమారుడు మరియు ఎక్కటి వాసు రెడ్డి కుమార్తె వివాహ మహోత్సవానికి కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇంఛార్జి ఝాన్సీ రాజేందర్ రెడ్డి హాజరై నూతన వదువరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు, మండల నాయకులు, పార్టీ సీనియర్ నాయకులు,యువజన నాయకులు,గ్రామ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మాకు న్యాయం చేయండి సార్

- మా ప్లాట్లను ఆక్రమించి కంపౌండ్ నిర్మించుకుండ్రు
- అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని బాధితుల డిమాండ్
- రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు



**అబ్దుల్లాపూర్మెట్, మహా:** మా ప్లాట్లను కొంత మది కబ్జా చేసి కంపౌండ్ హాల్ నిర్మించుకున్నారని... అలాంటి వారిపై చర్యలు తీసుకొని మాకు న్యాయం చేయలంటూ బాధితులు సోమవారం ప్రభుత్వ నిర్వహించే ప్రజావాణిలో హైడ్రా కమీషనర్ రంగనాథ్కు, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి, రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీలకు వినతి పత్రం అందచేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్మెట్ మండలం కుంట్లూరు గ్రామ రెవెన్యూ సర్వే నెంబర్ 273/2లో 1993లో జోర్క పోచయ్య, కుసుకుంట్ల అంజిరెడ్డి, తదితరులు వివిధ జీపీ లే అవుట్లు చేశారు. ఆ లే అవుట్లలో 120గజాలు, 150 గజాల ప్లాట్లు చేశారన్నారు. ఇందులో 102 మందిమీ ప్లాట్లు కొనుగోలు చేశామని తెలిపారు. కాయకష్టం చేసుకొని ప్లాట్లను కొనుగోలు చేస్తే.. ఇప్పుడు మా ప్లాట్లను కబ్జా చేసి అందులో కంపౌండ్ హాల్ నిర్మించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సర్వే 273/2 నెంబర్, ఈ లే అవుట్లకు సంబంధించి ప్రతి ఒక్క డాక్కుమెంట్లు మా దగ్గర ఉన్నాయన్నారు. ఈ లే అవుట్లకు సంబంధించిన డాక్యుమెంట్లను పరిశీలించి.. కబ్జా చేసి నిర్మించిన కంపౌండ్ హాల్ను తొలగించి.. వారిపై చర్యలు తీసుకోని మా న్యాయం చేయాలని కోరామని తెలిపారు.

## వలస ఆదివాసీ గ్రామాల సమస్యలు పరిష్కరించాలి

- తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి గొంది రాజేష్



**ములుగు, మహా :** జిల్లాలోని వివిధ ప్రాంతాలలో నివసిస్తున్న వలస ఆదివాసీ గ్రామాల ప్రజల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి గొంది రాజేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం కలెక్టరేట్ కు వచ్చిన ఆయా గ్రామాల ప్రజలు గ్రీవెన్స్ లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ.. గత 20ఏళ్లుగా జిల్లాలోని వివిధ మండలాల్లో 68వలస ఆదివాసీ గ్రామాలు నివాసం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. ఇప్పటికీ ఆయా గ్రామాలకి శాశ్వత కరెంట్ లేక పోవడం బాధాకరం అన్నారు. చేతిపంపులు ఉన్నా తాగేందుకు నీరు అనుకూలంగా లేదని, ఫ్లోరైడ్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. వన్య ప్రానుల సంరక్షణ కోసం అనేక చర్యలు చేపడుతున్న ప్రభుత్వాలు సాటి మనుషులుగా వలస ఆదివాసులను గుర్తించకపోవడం దారుణమన్నారు. అటవీ సంరక్షణ పేరుతో ఎలాంటి ఆంక్షలు లేకుండా వేలాది ఎకరాల అడవిని కార్పొరేట్ లకు అప్పనంగా అప్పజెప్పే ప్రభుత్వ చట్టాలు ఆదివాసీలు బతికేందుకు ఉపయోగపడటం లేదన్నారు. ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమములో సంఘం జిల్లా అధ్యక్షుడు దుగ్గి చిరంజీవి, నాయుకలు శోభన్, చంటి, దేవయ్య, సోమేశ్, పాండు, దేవేందర్, గంగయ్య, ఆదివాసి గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



**వరంగల్, మహా:** వరంగల్ జిల్లా ప్రజలందరికీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ తెలంగాణ ప్రభుత్వం వరంగల్ జిల్లా ఎన్నికల అధికారి & కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశాల ప్రకారం తేదీ 27.02.2025 తేదీన జరుగు ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని వరంగల్ జిల్లాలోని అన్ని మద్యం షాపులు, బార్ రెస్టారెంట్లు, కల్లు దుకాణములు, కల్లు డిపోలు తేదీ 25.02.2025 రోజున సాయంత్రం 4:00 గంటల నుండి 27.02.2025 సాయంత్రం 04:00 గంటల వరకు మూసివేయబడును. కావున వరంగల్ జిల్లాలోని అన్ని మద్యం షాపులు బార్ రెస్టారెంట్లు, కల్లు దుకాణంలో కల్లు డిపోల లైసెన్సీలు ఇట్టి నిబంధనకు సహకరించగలరు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించినట్లయితే వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకోబడుతాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు.

## సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీని కలిసిన సీపీఎం మండల కార్యదర్శి బుర్రు అనిల్ కుమార్



**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రజా సమస్యలపై చర్చిన నాయకులు. హైదరాబాద్ లోని సీపీఎం తెలంగాణ రాష్ట్ర పార్టీ కార్యాలయంలో నూతన రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ జాన్ వెస్లీ ని మర్యాద పూర్వకంగా కలసి పూలేబొక్కే, శాలువత సన్మానించడం జరిగింది. అనంతరం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ తెలంగాణలో రానున్న రోజుల్లో ఉద్యమాలు ఉధృతం చేయడం కోసం సంసిద్ధం కావాలని తెలిపారు.అదే విధంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అవుట్సోర్సింగ్ ఉద్యోగాల విషయంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కార్మికుల సమస్యల గురించి ఖాళీగా రాకేష్ కుమార్ రాష్ట్ర కార్యదర్శి గారికి అనేక సమస్యలు వారి దృష్టికి తీసుకుపోవడం జరిగింది అదేవిధంగా తుంగతుర్తి నియోజకవర్గ వ్యాప్తంగా అనేక ప్రజా సమస్యలను గాలికి వదిలేసి కాలయాపన చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని కూడా రాష్ట్ర కార్యదర్శి దృష్టికి తీసుకుపోవడం జరిగింది అదేవిధంగా ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న విద్య రంగ సమస్యలను పరిష్కరించాలని ఈ సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకుపోవాలని కోరడం జరిగింది అని అన్నారు

# కలెక్టరేట్ ఎదుట కార్మికుల మహాధర్నా

- ప్రభుత్వం ఏర్పాటై 15 నెలలు సమస్య పరిష్కరించలే
- ఆరు నెలలుగా కార్మికులకు వేతనాలు లేవు
- అప్పులపాలై కుటుంబాల పరిస్థితి దారుణం




**రంగారెడ్డి జిల్లా , మహా:** మధ్యాహ్న భోజన పథకం కార్మికులు కలెక్టరేట్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్మికులకు ఆరు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడం, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై 15 నెలలు గడుస్తున్న కార్మికుల సమస్య పరిష్కరించకపోవడంతో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు స్వప్న అధ్యక్షతన, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఎదుట మహా ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ ధర్నాకు ముఖ్య అతిథిగా సిపిఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య హాజరై కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ... మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యల పరిష్కారం కోసం గతంలో ఉన్నటువంటి ప్రభుత్వం పట్టించుకోని సందర్భంలో కార్మికులు సమ్మె నిర్వహించారు. అప్పటి ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ, ప్రస్తుతం అధికారంలో ఉన్నటువంటి కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సమ్మె చేస్తున్నటువంటి మహిళల వద్దకు చేరుకుని, మహిళలు రోడ్లపై ధర్నాలు చేస్తున్నా, అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గం అదే అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మీ సమస్యలు పరిష్కారం చేస్తామని చెప్పడం జరిగిందన్నారు. ఈ సమస్య పరిష్కారం చేయాలని కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టామన్నారు. జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డిని తన కార్యాలయంలో సిఐటియూ నాయకులు, కార్మికులు కలిసి, ధర్నా వద్దకు వచ్చి కార్మికుల గోస విని వారి సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని కోరడంతో, మేము గేటు దగ్గరికి వచ్చి కార్మికులతో మాట్లాడే పరిస్థితి లేదని, సిఐటియు నాయకులతో దుర్మార్గంగా మాట్లాడడం దారుణమన్నారు. కార్మికులు కలెక్టరేట్ మెయిన్ గేట్ దగ్గర ధర్నా చేస్తుంటే, ఏమాత్రం పట్టించుకోకుండా కలెక్టర్ దొడ్డిదారిన వెళ్లిపోయారని మండిపడ్డారు. కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు గేట్ దగ్గర నుంచి జరిగే ప్రసక్తి లేదని కూర్చోవడంతో, కలెక్టరేట్ కార్యాలయ అధికారులు, కొంత మంది కార్మికులతో చర్చలు జరిపారు. రెండు మూడు రోజుల్లో సమస్య పరిష్కారం చేయకపోతే, ప్రభుత్వ అధికారులకు మెమోరాండం అందించి, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు విధులు బహిష్కరించి, సమస్య పరిష్కారం అయ్యేంతవరకు కలెక్టరేట్ కార్యాలయం ముందు నిరవధిక సమ్మె చేయడానికి సిద్ధంగా ఉన్నామని, ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి సిఐటియు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు జాజాల రుద్రకుమార్, సిఐటియు రంగారెడ్డి జిల్లా నాయకులు పోచమోని కృష్ణ, బుట్టి బాలరాజు, పెంటయ్య, రంగారెడ్డి జిల్లా మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు గణేష్, అండాలు, అలివేలు, సరిత, సావిత్రి, కవిత, అక్కమ్మ, రాజేష్, నరేందర్, నర్సింగ్ రావు, మధ్యాహ్న భోజన కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## పేదవారి సొంత ఇంటి కల నిజం అయ్యేలా చూడాలి

### రాష్ట్ర హౌసింగ్ ఎండి విపి గౌతమ్



**హుజూర్ నగర్, మహా:** పేదవారి సొంత ఇంటి కల నిజం అయ్యేలా చూడాలని రాష్ట్ర హౌసింగ్ ఎండి విపి గౌతమ్ అన్నారు. సోమవారం హుజూర్నగర్ హౌజింగ్ కాలనీని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తో కలిసి రాష్ట్ర హౌజింగ్ ఎండి విపి గౌతమ్ సందర్శించారు. ఈ సందర్భంగా హౌజింగ్ ఎండి మాట్లాడుతూ సింగిల్ బెడ్ రూమ్ నిర్మాణ పనులు యుద్ధప్రతిపాదకన పూర్తిచేయాలని 135 బ్లాక్ లలో 2160 సింగిల్ బెడ్ రూమ్ నిర్మాణ పనులు మొదలు పెట్టడం జరిగిందని ఇప్పటి వరకు 88 బ్లాక్ లలో 1408 ఇండ్లు పూర్తి చేయటం జరిగిందని తెలిపారు. తదుపరి హౌజింగ్ కాలనీ మొత్తం కలియ తిరుగుతూ నిర్మాణ పనులు పరిశీలించి కాలనిలో రోడ్లు, త్రాగునీరు, డ్రైనేజి, విద్యుత్ లైన్స్, ట్యాంక్స్ (ఎస్ టి పి )లాంటి మౌళిక వసతులు త్వరగా ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.మిగిలిన ఇండ్లు ఎక్కువ సిబ్బందిని,కూలీలను నియమించుకొని నిర్మాణాలను రెండు నెలలో పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేసే విదంగా చూడాలని అధికారులను, కాంట్రాక్టర్ ని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ డి ఓ శ్రీనివాస్ లు, హౌజింగ్ ఎస్ ఈ వెంకటదాస్ రెడ్డి,పిడి ధర్మారెడ్డి, ఎఈ సాయిరాం రెడ్డి , మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి,వర్క్ ఇన్స్ పెక్టర్ అబ్దుల్లా, కాంట్రాక్టర్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.



## బేరిష్ ట్రెండ్‌లోనే ట్రేడింగ్!

దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాల్లోనే నడుస్తున్నాయి. నిజానికి జనవరి నుంచి సూచీలు తీవ్ర ఆటుపోట్లకే లోనవుతున్నాయి. స్థిరత్వం లోపించిందనే చెప్పాలి. అమ్మకాలు, కొనుగోళ్ల మధ్య ఇన్వెస్టర్లు ఊగిసలాటకు గురవుతున్నారు మరి. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 628.15 పాయింట్లు లేదా 0.82 శాతం పతనమై 75,311. 06 వద్ద ముగిసింది. నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 133.35 పాయింట్లు లేదా 0.58 శాతం క్షీణించి 22,795.90 దగ్గర నిలిచింది. ఈ నెల 1న పార్లమెంట్‌లో ప్రకటించిన కేంద్ర బడ్జెట్, ఆ తర్వాత వచ్చిన ద్రవ్యసమీక్షలో అంచనాలు అందుకోని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) వడ్డీరేట్ల కోతలు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వేస్తున్న సుంకాలు.. మదుపరులను పెట్టుబడులకు దూరం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ వారం కూడా ట్రేడింగ్‌లో ఒడుదొడుకులకు ఆస్కారముందని మెజారిటీ నిపుణుల అంచనా. ఇక డాలర్‌తో పోల్చితే ఆల్‌టైమ్ కనిష్ఠాల వద్ద కదలాడుతున్న రూపాయి మారకం విలువ.. మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తూనే ఉన్నది. అలాగే గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, విదేశీ మదుపరుల పెట్టుబడులు, ముడి చమురు ధరలు, అంతర్జాతీయ పరిణామాలూ ముఖ్యమేనని చెప్పవచ్చు. కాగా, అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 22,300 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 22,100 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 23,00023,200 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

## ఓల్డ్ ఈజ్ గోల్డ్!

### ఇప్పటికీ పాత పన్ను విధానమే లాభమా?



ఇటీవలి బడ్జెట్‌లో వ్యక్తిగత ఆదాయ పన్ను కొత్త విధానాన్ని కేంద్ర ప్రభుత్వం మరింత ఆకర్షణీయంగా మార్చిన విషయం తెలిసిందే. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025 26)గాను ఈ నెల 1న పార్లమెంట్‌లో ప్రకటించిన పద్దులో ఏకంగా రూ.12 లక్షలదాకా వార్షిక ఆదాయం ఉన్నవారికి ఎలాంటి పన్నులు ఉండబోవని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. మునుపు ఇది రూ.7 లక్షలుగానే ఉన్నది. ఇక స్టాండర్డ్ డిడక్షన్ రూ.75 వేలతో కలిపితే ఈ పన్ను మినహాయింపు ప్రయోజనం రూ. 12.75 లక్షలకు చేరుతున్నది. అయితే బడ్జెట్‌కు ముందున్న కొత్త పన్ను విధానంతో పోల్చితే ఇప్పుడు రూ.5 లక్షలకుపైగా పన్ను మినహాయింపు ప్రయోజనం పెరిగినా.. ఇంకా పాత పన్ను విధానంలోనే ట్యాక్స్‌పేయర్స్‌కు అధిక లాభాలు కనిపిస్తుండటం గమనార్హం. రూ.15 లక్షలు వార్షిక వేతనం ఉన్నవారు.. గరిష్ఠ పన్ను మినహాయింపులను కనుక ఉపయోగించుకున్నట్టైతే కొత్త పన్ను విధానం కింద చెల్లించాల్సి వచ్చే పన్నుల్లో సగం చెల్లిస్తే సరిపోతున్నది మరి. 48వేల రూపాయలకుపైగా ప్రయోజనం చేకూరుతున్నది.

**ఇదీ సంగతి..**

దేశంలోని వ్యక్తిగత ఆదాయ పన్ను చెల్లింపుదారులందర్నీ కొత్త ఆదాయ పన్ను పరిధిలోకి తేవాలన్న లక్ష్యంతో మోదీ సర్కారు ముందుకెళ్తున్నది. అందుకే ఐదేండ్లుగా ప్రతీ బడ్జెట్‌లో ఈ కొత్త ఆదాయ పన్ను విధానంలోనే రకరకాల సవరణలు, మినహాయింపులు, ప్రయోజనాలను కల్పిస్తూ వస్తున్నది. 2020లో కొత్త ఆదాయ పన్ను విధానాన్ని తెరపైకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. అప్పట్నుంచి పాత ఆదాయ పన్ను విధానం జోలికే వెళ్లడం లేదు. అయినప్పటికీ ట్యాక్స్‌పేయర్స్‌కు ఇంకా పాత ఆదాయ పన్ను విధానమే ఉత్తమంగా నిలుస్తుండటం గమనార్హం. అయితే పొదుపు, పెట్టుబడులు, పెద్దగా ఖర్చులు లేని ఉద్యోగులు.. కొత్త ఆదాయ పన్ను విధానాన్ని ఎంచుకోవడమే లాభదాయకం అని చెప్పవచ్చు. కానీ ఏటా పీపీఎఫ్, ఈపీఎఫ్, ఈఎల్ఎస్ఎస్, ఎన్‌పీఎస్, గృహ రుణం, బీమా ప్రీమియంలు, గృహ రుణ అలవెన్స్ (హెచ్ఆర్ఏ), పిల్లల విద్య కోసం చేసే ఖర్చులు వంటివి క్లెయిం చేసుకునే వీలున్నవారు మాత్రం పాత ఆదాయ పన్ను విధానాన్ని అనుసరించడమే ఇప్పటికీ లాభదాయకమని చెప్పవచ్చు.

**గుర్తుంచుకోండి**

కొత్త ఆదాయ పన్ను విధానంలో వార్షిక ఆదాయం రూ.12.75 లక్షలు దాటితే వయసుతో సంబంధం లేకుండా అందరికీ ఒకేలా ఆయా శ్లాబుల ప్రకారం పన్ను రేట్లు వర్తిస్తాయి. పాత పన్ను విధానంలో 6080 ఏండ్ల వయసువారికి వార్షిక ఆదాయం రూ.3 లక్షలదాకా పన్ను లేదు. 80 ఏండ్లు దాటితే రూ.5 లక్షలదాకా పన్నుండదు. దీంతో వివిధ సెక్షన్ల కింద పన్ను మినహాయింపు గరిష్ఠంగా 6080 వారికి ఏటా రూ.11.25 లక్షలదాకా, 80 ఏండ్లు దాటినవారికి రూ.13.25 లక్షలదాకా ఉంటున్నది. కొత్త పన్ను విధానంలో స్టాండర్డ్ డిడక్షన్ రూ.75 వేలతో కలిపి వార్షిక ఆదాయం రూ.12.75 లక్షలదాకా పన్ను మినహాయింపున్నది. నిజానికి స్టాండర్డ్ డిడక్షన్‌తో కలిపి రూ.4.75 లక్షలదాకా ఎవరికీ పన్నుండదు. అయితే రూ.12.75 లక్షల లోపున్నవారికి మిగతా రూ.8 లక్షలకు శ్లాబుల ప్రకారం వర్తించే రూ.60 వేల పన్నును సెక్షన్ 87ఏ కింద రిబేటుగా ఇస్తున్నారు.



## భారీ నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

### 857 పాయింట్లు పతనమైన సెన్సెక్స్


దేశీయ స్టాక్ మార్కెట్ల పతనం కొనసాగుతున్నది. వరుసగా ఐదోరోజు సోమవారం నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రతికూల పవనాలు, ట్రంప్ హెచ్చరికతో మార్కెట్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఫిబ్రవరిలో యూఎస్ వినియోగదారుల సెంటిమెంట్ 15 నెలల కనిష్ఠానికి పడిపోయింది. డొనాల్డ్ ట్రంప్ సుంకాల ప్రణాళికలపై ఆందోళనల మధ్య ద్రవ్యోల్బణ భయాలు పెరిగాయి. ఈ ప్రభావం భారత్‌పై సైతం పడుతున్నది. గత సెషన్‌తో పోలిస్తే సోమవారం సెన్సెక్స్ 74,893.45 పాయింట్ల నష్టాల్లో మొదలయ్యాయి. మళ్లీ ఏ దశలోనూ కోలుకోలేదు. ఒక దశలో 74,387.44 పాయింట్ల కనిష్ఠానికి పతనమైన సెన్సెక్స్.. ఇంట్రాడేలో 74,907.04 పాయింట్ల గరిష్ఠాన్ని తాకింది. చివరకు 856.66 పాయింట్ల నష్టంతో.. 74,454.41 వద్ద ముగిశాయి. నిఫ్టీ 243.40 పాయింట్లు పతనమై.. 22,552.50 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో దాదాపు 1126 షేర్లు లాభపడ్డాయి. 2,526 షేర్లు పతనమయ్యాయి. విప్రో, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్, టీసీఎస్, టాటా స్టీల్ భారీగా నష్టపోయాయి. ఎంఅండ్ఎం, ఐషర్ మోటార్స్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, హీరో మోటోకార్ప్, కోటక్ మహీంద్రా బ్యాంక్ లాభపడ్డాయి. ఆటో, ఫార్మా, ఎఫ్ఎంసీజీ మినహా, అన్ని ఇతర రంగాల సూచీలు ఐటీ, మెటల్, టెలికాం సూచీలు 2 శాతం క్షీణించాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఒక్కొక్కటి ఒకశాతం వరకు తగ్గాయి.



## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



## మీకు నా సేవలు అవసరం లేకపోతే..
## కాంగ్రెస్‌కు శశిథరూర్ సందేశం




'కాంగ్రెస్ పార్టీ కి శశిథరూర్ సేవలు అక్కర్లేకపోతే.. అతడు చేసుకోవడానికి ఇంకా ఇతర పనులు చాలా ఉన్నాయి' అని ఆ పార్టీ సీనియర్ నేత శశిథరూర్ హైకమాండ్ కు సందేశం పంపారు. కేరళలోని వామపక్ష ప్రభుత్వం పై ఇటీవల ప్రశంసలు కురిపించాడని ఆ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ శశిథరూర్‌పై గుర్రుగా ఉన్న నేపథ్యంలో ఆయన ఇలాంటి సందేశం పంపడం చర్చనీయాంశమైంది.

అదేవిధంగా కేరళలో కాంగ్రెస్‌కు నాయకుడు లేడని కూడా శశిథరూర్ వర్తమానం అనే మలయాళ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఆ పూర్తి ఇంటర్వ్యూ బుధవారం ప్రసారం కానుంది. దానికి సంబంధించి టీజర్ ఇప్పటికే బయటకు వచ్చింది. దౌత్యవేత్త నుంచి రాజకీయ నాయకుడిగా మారిన శశిథరూర్ కేరళ నుంచి వరుసగా నాలుగు పర్యాయాలు ఎంపీగా గెలిచారు.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధాని నరేంద్రమోదీ సమావేశం కావడాన్ని కూడా శశిథరూర్ ప్రశంసించారు. ఇది కూడా కాంగ్రెస్ పార్టీ నుంచి ఆయన విమర్శలు ఎదుర్కోవడానికి కారణమైంది. అయితే శశిథరూర్ మాత్రం తన వ్యాఖ్యలను సమర్థించుకున్నారు. రాష్ట్ర అభివృద్ధి గురించి తన అభిప్రాయాలను తెలియజేసే హక్కు తనకు ఉందని ఆయన చెప్పారు. 'పార్టీ నేను కావాలని కోరుకుంటే పార్టీ కోసం పనిచేస్తా. వద్దనుకుంటే నేను చేసుకునే సొంత పనులు చాలా ఉన్నాయి. కాలం గడపడానికి నాకు ఎలాంటి వ్యాపకాలు లేవని మీరు అనుకోవద్దు. నాకు చాలా వ్యాపకాలు ఉన్నాయి. పుస్తకాలున్నాయి. ప్రసంగాలున్నాయి. నా స్పీచ్ కోసం ప్రపంచ దేశాల నుంచి ఆహ్వానాలు ఉన్నాయి.' అని శశిథరూర్ కాంగ్రెస్‌కు ఇచ్చిన సందేశంలో పేర్కొన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మంచి ఫలితాలు వచ్చాయని, కానీ ఆ తర్వాత జరిగిన వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో అవే ఫలితాలు ప్రతిబింబించలేదని థరూర్ తెలిపారు. కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో గెలువాలంటే కాంగ్రెస్ పార్టీ మరింత విస్తరించాలని, లేకపోతే వరుసగా మూడోసారి కూడా ప్రతిపక్షానికే పరిమితం కావడం ఖాయమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి కేరళలో ప్రస్తుతం ఉన్న బలంతో గెలువడం అసాధ్యమని చెప్పారు.

## కర్ణాటక ఆసుపత్రిలో నిర్లక్ష్యం.. మహిళ కడుపులో బ్యాండేజ్ వదిలేసిన వైద్యులు

**బెంగళూరు:** ఒక ఆసుపత్రిలో డాక్టర్ల నిర్లక్ష్యం వెలుగులోకి వచ్చింది. మహిళకు సిజేరియన్ డెలివరీ చేసిన వైద్యులు ఆమె కడుపులో బ్యాండేజ్ వదిలేశారు. దీంతో ఆమె అనారోగ్యంతో బాధపడింది. ఈ నేపథ్యంలో స్కానింగ్ చేయగా ఈ విషయం బయటపడింది. కర్ణాటకలోని దక్షిణ కన్నడ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. గత ఏడాది నవంబర్ 24న ఒక గర్భిణీ కాన్పు కోసం పుత్తూరులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేరింది. డాక్టర్ అనిల్ నేతృత్వంలోని ముగ్గురు వైద్యుల బృందం ఆమెకు సిజేరియన్ ఆపరేషన్ ద్వారా డెలివరీ చేశారు. కాగా, గత ఏడాది డిసెంబర్ 2న హాస్పిటల్ నుంచి ఆ మహిళ డిశ్చార్జ్ అయ్యింది. ఇంటికి వచ్చిన కొన్ని రోజుల్లోనే నిరంతరం కడుపు నొప్పి, జ్వరం, ఇతర అనారోగ్య సమస్యలతో ఆమె బాధపడింది. ఆరోగ్యం క్షీణిస్తుండటంతో ఆ మహిళ భర్త ఆందోళన చెందాడు. సర్జరీ చేసిన వైద్యులను సంప్రదించాడు. దీంతో డిసెంబర్ 19న ఆ మహిళ కడుపు స్కానింగ్ చేయగా సర్జరీ తర్వాత డాక్టర్లు లోపల బ్యాండేజ్ వదిలేసినట్లు బయటపడింది. మరోవైపు డాక్టర్ల పొరపాటును గ్రహించిన భర్త ఆమెను మరో హాస్పిటల్‌కు తీసుకెళ్లాడు. అక్కడి డాక్టర్లు సర్జరీ ద్వారా కడుపులో ఉన్న బ్యాండేజ్‌ను తొలగించారు. డిశ్చార్జ్ అయిన తన భార్య కోలుకుంటున్నట్లు భర్త గగన్‌దీప్ తెలిపాడు. ఫిబ్రవరి 22న ఎక్స్‌లో పోస్ట్ చేశాడు. డాక్టర్ల నిర్లక్ష్యాన్ని ఎండగట్టాడు. తల్లీ బిడ్డ చాలా ఇబ్బంది పడినట్లు వాపోయాడు. వారు ఏం తప్పుచేశారని అతడు ప్రశ్నించారు. తన భార్య ప్రాణాలకు ముప్పు కలిగించిన సంబంధిత డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాడు. తమకు న్యాయం చేయాలని అందులో కోరాడు. అయితే ఆ ఆసుపత్రి లేదా ఆ డాక్టర్లపై పోలీసులకు అతడు ఎలాంటి ఫిర్యాదు చేయలేదు.



## రాబందులకు శవాలు, పందులకు రోత
### కుంభమేళా విమర్శకులపై యూపీ సీఎం ఆగ్రహం



మహా కుంభమేళా మరో రెండు రోజుల్లో ముగియనుండగా విమర్శకులపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. అందుకు ఏకంగా యూపీ అసెంబ్లీనే వేదికగా చేసుకున్నారు. కుంభమేళా నిర్వహణలో ప్రభుత్వం విఫలమైందంటూ యూపీ ప్రతిపక్ష నేత అఖిలేష్ యాదవ్ ఆరోపించడం, కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే, తృణమూల్ చీఫ్ మమతాబెనర్జి, ఎస్పీ ఎంపీ జయాబచ్చన్ విమర్శలు చేయడం లాంటి పరిణామాల నేపథ్యంలో సీఎం యోగీ ఇవాళ అసెంబ్లీ సాక్షిగా ఆగ్రహం వెళ్లగక్కారు. మహా కుంభమేళా ఒక నిక్షేప స్థానం (భాండాగారం) అని, దాని నుంచి ప్రజలు ఏది కోరుకుంటే అది దక్కిందని యోగీ ఆదిత్యనాథ్ ఆవేశంగా చెప్పారు. రాబందులకు శవాలు దొరికాయని, పందులకు రోత దొరికిందని వ్యాఖ్యానించారు. సున్నిత మనస్కులైన ప్రజలకు మానవ సంబంధాలకు సంబంధించి అందమైన చిత్రాలు దొరికాయని, వ్యాపారులకు వ్యాపారం నడిచిందని చెప్పారు. కోట్ల మంది భక్తులకు కుంభమేళాలో పరిశుభ్రమైన ఏర్పాట్లు దక్కాయని అన్నారు. ఈ సందర్భంగా అఖిలేష్ యాదవ్ హయాంలో జరిగిన కుంభమేళా గురించి యోగీ ప్రస్తావించారు. 'మహా కుంభమేళాకు రాకుండా ఒక కులాన్ని పత్యేకంగా అడ్డుకున్నారని మీరు చెబుతున్నారు. కానీ ఏ కులాన్ని అడ్డుకోలేదు. సదుద్దేశంతో ఎవరైనా కుంభమేళాకు వెళ్లవచ్చు. దురుద్దేశంతో వెళ్లి అక్కడ కలకలం రేపాలనుకునే వాళ్లు కచ్చితంగా ఇబ్బందులు పడాల్సి వస్తుంది' అని యోగీ హెచ్చరిక దోరణితో అన్నారు. 'మీ లాగా మేం విశ్వాసాలతో ఆడుకోం. మీ హయాంలో ముఖ్యమంత్రికి కుంభమేళాను చూసి సమీక్షించే సమయం లేదు. అందుకే సనాతని కాని వ్యక్తిని కుంభమేళాకు ఇన్‌చార్జిగా పెట్టారు. 2013 కుంభమేళాలో గొడవలు, అవినీతి జరగడానికి, కాలుష్యం పెరగడానికి, త్రివేణి సంగమంలో స్నానాలకు సరిపడా నీళ్లు లేకపోవడానికి అదే కారణం. కానీ ఇప్పుడు నేను స్వయంగా వెళ్లి మహాకుంభమేళాపై సమీక్ష చేశాను. ఇప్పటికీ చేస్తున్నాను. నాటి మారిషష్ ప్రధాని స్నానానికి నిరాకరించడమే అప్పటి నిర్వహణ లోపానికి నిదర్శనం' అని అఖిలేష్ యాదవ్‌పై యోగి మండిపడ్డారు. ఫిబ్రవరి నెల ఆరంభంలో తొక్కిసలాట జరిగి 18 మంది మరణించినప్పటి నుంచి మహా కుంభమేళాపై విమర్శల దాడి పెరిగింది. ప్రతిపక్ష కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే.. తొక్కిసలాటలో వేల మంది మరణించారని వ్యాఖ్యానించడం పార్లమెంట్‌లో తీవ్ర గందరగోళానికి తెరతీసింది. తొక్కిసలాట మరణించిన వారి మృతదేహాలను నదిలోకి విసిరేశారని ఎస్పీ ఎంపీ జయాబచ్చన్ ఆరోపించారు. మతం పేరుతో జరిగిన ఈ కూడిక మహా కుంభ్ కాదని మృత్యుకుంభ్ అని బెంగాల్ సీఎం మమతాబెనర్జి వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో ఇవాళ అసెంబ్లీ సాక్షిగా యోగి విమర్శకులపై విరుచుకుపడ్డారు.

## ప్రియురాలు దూరమైందన్న ఆగ్రహంతో..
## కార్లకు నిప్పుపెట్టిన వ్యక్తి

**బెంగళూరు:** ప్రియురాలు దూరంగా ఉండటంపై ఒక వ్యక్తి ఆగ్రహించాడు. తన అనుచరులతో కలిసి ఆమె తల్లిదండ్రులకు చెందిన కార్లకు నిప్పుపెట్టాడు. ఆ మహిళ సోదరుడి బైక్‌ను ధ్వంసం చేశాడు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కర్ణాటక రాజధాని బెంగళూరులో ఈ సంఘటన జరిగింది. డిగ్రీ చదువుతున్న అమ్మాయిని రాహుల్ అనే వ్యక్తి ప్రేమించాడు. అయితే ఇది తెలిసిన తల్లిదండ్రులు ఆమెను మందలించారు. దీంతో ఆ మహిళ అతడికి దూరంగా ఉంటున్నది. కాగా, ప్రియురాలు దూరంగా ఉండటంపట్ల రాహుల్ ఆగ్రహంతో రగిలిపోయాడు. ఆదివారం అర్ధరాత్రి వేళ ముగ్గురు సహచరులతో కలిసి ఆ అమ్మాయి తండ్రి ఇంటికి వెళ్లాడు. ఆమెను తనకు దూరంగా ఉంచడంపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. మహిళ తండ్రి కారుకు నిప్పంటించాడు. ఆమె సోదరుడిపై దాడి చేశాడు. అతడి బైక్‌ను కూడా ధ్వంసం చేశాడు. మరోవైపు రాహుల్ ఆ తర్వాత ప్రియురాలు తన తల్లితో నివసించే అరెహల్లిలోని అపార్ట్‌మెంట్‌కు వెళ్లాడు. ఆమె తనతో మాట్లాడకపోవడంతో మరింతగా రెచ్చిపోయాడు. ఆమె తల్లి కారుకు నిప్పంటించాడు. పక్కన పార్క్ చేసిన మరో కారుకు మంటలు వ్యాపించడంతో అది కూడా కాలిపోయింది. సొసైటీ వాచ్‌మెన్‌ను కూడా వారు కొట్టారు. ఆ అపార్ట్‌మెంట్‌లోని సీసీటీవీలో ఇది రికార్డ్ అయ్యింది. కాగా, ఈ రెండు సంఘటనలపై పోలీసులకు ఫిర్యాదులు అందాయి. దీంతో కేసులు నమోదు చేశారు. రాహుల్, అతడి అనుచరులను అరెస్ట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. రౌడీ షీటర్ అయిన రాహుల్‌పై హత్యాయత్నంతో సహా 18 కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. 2002 జనవరిలో పోలీసులపై దాడి చేసేందుకు రాహుల్ ప్రయత్నించగా అతడి కాళ్లపై కాల్పులు జరిపినట్లు వెల్లడించారు.



## తాగుబోతులు వెంబడించడంతో
## రోడ్డు ప్రమాదంలో డ్యాన్సర్ మృతి



**కోల్‌కతా:** తాగుబోతులు వెంబడించి వేధించడంతో వారి బారి నుంచి తప్పించుకునేందుకు డ్యాన్సర్ ప్రయత్నించింది. ఆమె ప్రయాణించిన కారును వారు అడ్డగించి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఆ మహిళ మరణించింది. పశ్చిమ బెంగాల్‌లోని పశ్చిమ్ బర్ధమాన్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. హుగ్లీ జిల్లాలోని చందర్‌నగర్ ప్రాంతానికి చెందిన 27 ఏళ్ల సుచంద్ర చటోపాధ్యాయ, డ్యాన్సర్ కమ్ ఈవెంట్ మేనేజర్. ఆదివారం ఆమె తన బృందంతో కలిసి ఒక ప్రొగ్రామ్ కోసం బీహార్‌లోని గయకు కారులో బయలుదేరింది. రాత్రి 9.30 గంటల సమయంలో పనాగఢ్ సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద ఇంధనం నింపుకున్నది. కాగా, ఆ పెట్రోల్ బంకు వద్ద ఉన్న మరో కారులో ఐదుగురు వ్యక్తులున్నారు. మద్యం సేవించి ఉన్న వారు సుచంద్రను టీజ్ చేశారు. ఆమె వాహనం అక్కడి నుంచి బయలుదేరగా తమ కారులో వెంబడించారు. నిర్లక్ష్యగా డ్రైవ్ చేయడంతోపాటు ఆ మహిళ పట్ల అసభ్యకరంగా కామెంట్లు చేశారు. రోడ్డు డివైడర్ వద్ద ఆమె కారును ఢీకొట్టి అడ్డుకున్నారు. దీంతో ఆ వాహనం బోల్తాపడింది. ముందు సీటులో కూర్చొన్న ఆ మహిళ తీవ్రంగా, మిగతా ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. వారిని సమీపంలోని హాస్పిటల్‌కు తరలించగా సుచంద్ర మరణించినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మరోవైపు సుచంద్రను టీజ్ చేసి వేధించిన వ్యక్తులు తమ కారు నుంచి దిగి పారిపోయారు. ఈ ప్రమాదం గురించి తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ఆ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కారులో మద్యం సీసాలు, గ్లాసులు ఉండటాన్ని పోలీసులు గమనించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేశారు. ఆ కారు ఓనర్‌ను గుర్తించారు.



వీడి లాఠీకి దొరికినోడి పరిస్థితి ఆలోచిస్తే భయమేస్తుంది..

# స్టన్నింగ్‌గా నాని హిట్ 3 టీజర్

టాలీవుడ్ స్టార్ హీరో నాని (Nani) నటిస్తోన్న సినిమాల్లో ఒకటి హిట్ ఫ్రాంఛైజీ హిట్ 3 (HIT: The 3rd Case). శైలేష్ కొలను దర్శకత్వంలో వస్తోన్న హిట్ 3లో అర్జున్ సర్కార్‌గా కనిపించబోతున్నాడు నాని. నాని పాత్రపై స్నీక్ పీక్ అందిస్తూ గ్లింప్స్ విడుదల చేయగా.. మంచు పర్వతాల మధ్య కారుతో దూసుకుపోతున్న హిట్ ఆఫీసర్‌ని ఇద్దరు పోలీస్ ఆఫీసర్లు ఛేజ్ చేస్తున్న సన్నివేశాలు హైప్ క్రియేట్ చేస్తున్నాయి. తాజాగా మేకర్స్ టీజర్‌ను లాంచ్ చేశారు. సార్ మీకు ప్రాబ్లమ్ లేదంటే ఒక పేరు చెబుతా.. అర్జున్ సర్కార్.. అంటూ సాగే డైలాగ్స్‌లో షురూ అయింది టీజర్. ఈ కేసు ఆడికివ్వడంలో ప్రాబ్లమ్స్ ఏం లేదుగానీ.. వీడి లాఠీకి దొరికినోడి పరిస్థితి ఆలోచిస్తే భయమేస్తుందని ఉన్నతాధికారి హోదాలో ఉన్న రావు రమేశ్ అంటుండగా.. మరోవైపు డ్యూటీలో చేరిన అర్జున్ సర్కార్ అందరూ ఒకే మెథడ్‌లో మర్డర్ చేస్తున్నారంటే ఏదో మోటివ్ ఉందంటున్నాడు. మొత్తానికి మిస్టరీ కేసులను అర్జున్ సర్కార్‌గా లాఠీకి పని చెబుతూ ఎలా ఛేధించాడనే నేపథ్యంలో ఆసక్తికరంగా సినిమా ఉండబోతున్నట్టు టీజర్ హింట్ ఇచ్చేస్తుంది. ఈ చిత్రాన్ని 2025 మే 1న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. ఈ చిత్రాన్ని వాల్‌పోస్టర్ సినిమా, నాని హోం బ్యానర్ యునానిమస్ ప్రొడక్షన్స్ పై ప్రశాంతి త్రిపురనేని తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీకి మిక్కీ జె మేయర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.



# డ్రాగన్ అందమైన సినిమా


## డైరెక్టర్ శంకర్ ట్వీట్‌కు ప్రదీప్ రంగనాథన్ రియాక్షన్ ఇదే

లవ్ టుడే ఫేం ప్రదీప్ రంగనాథన్ (Pradeep Ranganathan) నటించిన తాజా చిత్రం డ్రాగన్ (Dragon). ఓ మై కడవులే ఫేం అశ్వత్ మారిముత్తు దర్శకత్వం వహించిన ఈ మూవీ ఫిబ్రవరి 21న ప్రేక్షకుల ముందుకొచ్చిన విషయం తెలిసిందే. ఈ చిత్రానికి మంచి స్పందన వస్తోంది. ఈ మూవీపై స్టార్ డైరెక్టర్ శంకర్ ప్రశంసలు కురిపించాడు. డ్రాగన్ ఒక అందమైన సినిమా. అశ్వత్ మారిమత్తు అద్భుతమైన రచనతో సినిమా తెరకెక్కించిన తీరుకు హ్యాట్సాఫ్ చెప్పాల్సిందే. ప్రదీప్ రంగనాథన్ రాఘవన్ పాత్రలో మరోసారి తనలోని అద్భుతమైన నటుడిని చూపించాడు. ఇక జార్జ్ మరియన్, అనుపమ పరమేశ్వరన్, ముస్కిన్ పాత్రలు ఎప్పటికీ గుర్తుండిపోతాయి. చివరి ఇరవై నిమిషాలు నన్ను కన్నీళ్లు పెట్టించాయి. మోసగాళ్ల సంఖ్య పెరుగుతున్న ఈ ప్రపంచంలో చాలా అవసరమైన సందేశం ఇది.. అని ట్వీట్ చేశాడు శంకర్. మీ సినిమాలు చూస్తూ పెరిగిన ఓ యువకుడు మీ నుంచి ప్రశంసలు పొందడం కలలో కూడా ఊహించనిది. ఓ అభిమానిగా.. నా అభిమాన దర్శకుడు (శంకర్) నుంచి స్ఫూర్తి పొందే వ్యక్తిగా.. మీరు నా గురించి మాట్లాడటం నమ్మశక్యంగా అనిపించడం లేదు. నా భావాలను మాటల్లో చెప్పలేకపోతున్నా. ధన్యవాదాలు సార్. ప్రేమతో అంటూ తన ఎక్స్ ట్‌మెంట్‌ను సందేశంలా రాసుకొచ్చాడు.

యష్ సినిమా ఆ విషయంలో

# ఫస్ట్ ప్రాజెక్ట్..

## టాక్సిక్ సినిమా గురించి తెలుసా.. ?





భారతీయ భాషలతో పాటుగా ఇంగ్లీష్‌లోనూ సమాంతరంగా టాక్సిక్ సినిమాను షూట్ చేస్తున్నారు. ఇలా ఇంగ్లీష్‌లో చిత్రీకరిస్తున్న మొట్టమొదటి భారతీయ చిత్రంగా టాక్సిక్ రికార్డుల్లోకి ఎక్కింది. రాకింగ్ స్టార్ యష్ హీరోగా తెరకెక్కుతున్న ఈ చిత్రం హిందీ, తెలుగు, తమిళం, మలయాళంతో సహా పలు భారతీయ, అంతర్జాతీయ భాషల్లోకి డబ్ కానుంది. ఈ ప్రాజెక్టుకి అంతర్జాతీయంగా ప్రశంసలు పొందిన గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. కన్నడ, ఇంగ్లీష్ భాషల్లో సమాంతరంగా ఈ చిత్రాన్ని షూట్ చేస్తుండటంతో చిత్ర నిర్మాతల నిబద్ధత ప్రతిబింబిస్తుంది. ప్రాంతీయ భాషకు వారు ప్రాధాన్యం ఇస్తూనే.. ప్రపంచ వ్యాప్తంగా ఈ మూవీని రిలీజ్ చేయాలన్న ఉద్దేశాన్ని ఇలా చెప్పకనే చెప్పేశారు. గీతూ మోహన్‌దాస్ మాట్లాడుతూ..'విభిన్న భాషా, సాంస్కృతిక నేపథ్యాలలో రాబోతోన్న టాక్సిక్ మూవీని అన్ని భాషల, ప్రాంతాల ప్రేక్షకులు ఆస్వాధించేలా రూపొందిస్తున్నాం. అందుకే కన్నడ, ఆంగ్ల భాషల్లో తెరకెక్కిస్తున్నాం. మా ఈ చిత్రం అన్ని సరిహద్దుల్ని చెరిపివేస్తుందని భావిస్తున్నాం. అన్ని భాషల, సాంస్కృతిక ప్రపంచాన్ని కలిపేలా మా చిత్రం ఉంటుంది' అని అన్నారు.

KVN ప్రొడక్షన్స్, యష్ మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్‌పై వెంకట్ నారాయణ సంయుక్తంగా నిర్మించిన టాక్సిక్ ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ కాబోతోంది. సన్‌డాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్, టొరంటో ఫిల్మ్ ఫెస్టివల్‌తో సహా అనేక అంతర్జాతీయ వేదికలపై అవార్డులు పొందిన గీతూ మోహన్‌దాస్ ఈ మూవీని గ్రాండ్‌గా తెరకెక్కిస్తున్నారు. జాన్ విక్, ఫాస్ట్ అండ్ ఫ్యూరియస్ ఫ్రాంచైజీలకు పని చేసిన జేజే పెర్రీ యాక్షన్ సీక్వెన్స్‌లకు గ్లోబల్ ఆడియెన్స్ ఫిదా కానున్నారు. అంతే కాకుండా రీసెంట్‌గా డ్యూన్ పార్ట్ 2 విజువల్ ఎఫెక్ట్స్‌కి గానూ బాఫ్టా ఫిల్మ్ అవార్డుని అందుకున్న డినెగ్ ఈ మూవీకి విజువల్ ఎఫెక్ట్స్‌ను అందిస్తున్నారు. రాకింగ్ స్టార్ యష్ పుట్టినరోజున సందర్భంగా రిలీజ్ చేసిన 'టాక్సిక్' టీజర్ ఎన్నో రికార్డుల్ని క్రియేట్ చేసింది. టాక్సిక్ ప్రపంచాన్ని ఆ టీజర్ అందరికీ పరిచయం చేసింది. ఈ టీజర్ సినిమా స్థాయిని, అంతర్జాతీయప్రామాణిక నిర్మాణ విలువలను చాటి చెప్పింది. ఈ టాక్సిక్ చిత్రీకరణ గత ఏడాది ఆగస్టులో ప్రారంభమైంది. ఇప్పటి వరకు ఇండియన్ హిస్టరీలో అత్యంత భారీ ఖర్చుతో నిర్మించిన చిత్రాల్లో టాక్సిక్ ఒకటిగా నిలవనుంది.

క్రీడా వార్తలు | SPORTS NEWS



# బంగ్లాదేశ్‌పై న్యూజిలాండ్ విజయం

## టోర్నీ నుంచి పాక్ ఔట్

### బంగ్లాదేశ్‌పై న్యూజిలాండ్ విజయం

### టోర్నీ నుంచి పాక్, బంగ్లాదేశ్ ఔట్.. సెమీస్‌కు భారత్, కివీస్


ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో భాగంగా.. 6వ మ్యాచ్ బంగ్లాదేశ్ vs న్యూజిలాండ్ మధ్య జరిగింది. రావల్పిండి క్రికెట్ స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో న్యూజిలాండ్ విజయం సాధించింది. 237 పరుగుల లక్ష్యాన్ని 23 బంతులు ఉండగానే గెలిచింది. 46.1 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 240 పరుగులు చేసింది. ఈ మ్యాచ్‌లో రచిన్ రవీంద్ర (112) సెంచరీతో చెలరేగాడు. 105 బంతుల్లో 12 ఫోర్లు, ఒక సిక్సర్ సాధించాడు. న్యూజిలాండ్ బ్యాటింగ్‌లో టామ్ లాథమ్ (55), డెవిన్ కాన్వే (30), గ్లేన్ ఫిలిప్స్ (21*), మిచెల్ బ్రేస్ వెల్ (11*) పరుగులతో పర్వాలేదనిపించారు. బంగ్లాదేశ్ బౌలింగ్‌లో టస్కిన్ అహ్మద్, నహీద్ రానా, ముస్తఫిజుర్ రహమన్, రిషాద్ హుస్సేన్ తలో వికెట్ తీశారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్.. నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 236 పరుగులు చేసింది. బంగ్లా బ్యాటింగ్‌లో కెప్టెన్ నజ్ముల్ హుస్సేన్ శాంటో (77) ఒంటరి పోరాటం చేశాడు. ఆ తర్వాత జాకీర్ అలీ (45) పర్వాలేదనిపించాడు. రిషాద్ హుస్సేన్ (26), తంజీద్ హసన్ (24), మెహిదీ హసన్ మిరాజ్ (13) పరుగులు చేశారు. న్యూజిలాండ్ బౌలింగ్‌లో మిచెల్ బ్రేస్ వెల్ అత్యధికంగా 4 వికెట్లు పడగొట్టాడు. ఆ తర్వాత విల్ ఓ'రూర్కే రెండు వికెట్లు తీశాడు. హెన్రీ, జేమీసన్ తలో వికెట్ సంపాదించారు. కాగా.. ఈ న్యూజిలాండ్ విజయంతో వరుసగా రెండు మ్యాచ్‌లు గెలిచింది. బంగ్లాదేశ్ వరుసగా రెండు మ్యాచ్‌లు ఓడిపోయింది. దీంతో.. పాకిస్తాన్, బంగ్లాదేశ్ టోర్నీ నుంచి నిష్క్రమించగా.. భారత్, న్యూజిలాండ్ సెమీస్‌కు వెళ్లాయి.

# ఛాంపియన్స్ ట్రోఫీకి ఉగ్ర ముప్పు..

## పాక్ నిఘా వర్గాల హెచ్చరికలు..!

పాకిస్తాన్ వేదికగా జరుగుతున్న ఛాంపియన్స్ ట్రోఫీకి సందర్భంగా ఉగ్రవాద దాడి జరిగే అవకాశం ఉందని నిఘా వర్గాలు హెచ్చరించాయి. ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఖొరాసాన్ ప్రావిన్స్ ఉగ్రవాదులతో పాటు పలు సంస్థలు దాడి చేసే అవకాశం ఉందని నిఘా వర్గాలు హెచ్చరించిన నేపథ్యంలో.. భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. చాలా రోజుల తర్వాత పాకిస్తాన్ వేదికగా ఐసీసీ టోర్నీ జరుగుతున్న విషయం తెలిసిందే. అంతర్జాతీయ క్రికెటర్‌కు పాకిస్తాన్ సురక్షితమైన వేదికగా చాటిచెప్పేందుకు పాకిస్తాన్ బోర్డు ప్రయత్నిస్తుండగా.. భద్రతా ముప్పు పెను సవాల్‌గా మారింది. 2009లో శ్రీలంక క్రికెట్ జట్టుపై దాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనతో పాకిస్తాన్ దశాబ్ద కాలంగా కీలకమైన అంతర్జాతీయ టోర్నీలకు ఆతిథ్యం ఇవ్వలేకపోయింది. తాజాగా ఛాంపియన్స్ ట్రోఫీకి ఉగ్రవాదుల ముప్పు ఇబ్బందికరంగా మారింది.

ఓ మీడియా కథనం ప్రకారం.. పాక్ ఇంటెలిజెన్స్ బ్యూరో సెక్యూరిటీ అడ్వైజరీ జారీ చేసింది. తెహ్రిక్ఇ తాలిబాన్ పాకిస్తాన్ (TTP), ఐసిస్, బలూచిస్తాకు చెందిన పలు తీవ్రవాద గ్రూపులు టోర్నీకి హాజరయ్యే విదేశీ టూరిస్టులను లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉందని హెచ్చరించింది. చాలా సంవత్సరాల తర్వాత పాకిస్తాన్‌లో క్రికెట్ ఆడేందుకు మళ్లీ వస్తున్నాయి. తాజాగా ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ జరుగుతున్నది. తాజా భద్రతా సమస్యల నేపథ్యంలో పాకిస్తాన్ హై ప్రొఫైల్ టోర్నీలను నిర్వహించే సామర్థ్యంపై మరోసారి చర్చ జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే భారత్ భద్రతపై ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే భద్రతా కారణాలను చూపుతూ.. భారత్ ఆ దేశంలో పర్యటించేందుకు నిరాకరించింది. ఛాంపియన్స్ ట్రోఫీని హైబ్రిడ్ మోడల్‌లో దుబాయిలో మ్యాచులు ఆడుతున్నది. టీమిండియా మ్యాచులన్నీ దుబాయిలో జరుగుతుండగా.. మిగతా మ్యాచులకు పాకిస్తాన్ వేదికగా జరుగుతున్నాయి. ఇక నిఘా వర్గాల హెచ్చరికల నేపథ్యంలో అధికారులు స్టేడియాలు, జట్లు బస చేసే హోటల్స్, ఇతర కీలక ప్రదేశాల్లో భద్రతను పటిష్టం చేశారు.



ఛాంపియన్స్ ట్రోఫీలో ఆతిథ్య జట్టు పాకిస్తాన్ ప్రారంభ మ్యాచ్‌లో న్యూజిలాండ్ చేతిలో 60 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. ఆదివారం భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆరు వికెట్ల తేడాతో ఓడిపోయింది. దాంతో సెమీ ఫైనల్స్ ఆశలు దాదాపుగా గల్లంతయ్యాయి. పాకిస్తాన్ టోర్నీలో నిలువాలంటే.. బంగ్లాదేశ్‌పై విజయం సాధించాలి. అదే సమయంలో భారత్ జట్టు న్యూజిలాండ్‌ను ఓడించాలి. న్యూజిలాండ్, బంగ్లాదేశ్ కంటే ఎక్కువగా రన్ రేట్ ఉండేలా చూసుకోవాలి. సోమవారం బంగ్లాదేశ్‌పై న్యూజిలాండ్ గెలిస్తే.. పాకిస్తాన్ అధికారికంగా టోర్నమెంట్ నుంచి నిష్క్రమిస్తుంది. ఇప్పటికే ఆ జట్టు ప్రదర్శనతో పాకిస్తాన్ అభిమానులు నిరాశకు గురవుతుండగా.. తాజాగా ఛాంపియన్స్ ట్రోఫీకి ఉగ్రవాదుల ముప్పు వార్తలు ఆతిథ్య దేశానికి మరింత ఇబ్బందికరంగా మారాయి.

# బాబర్ ఆజం ఒక మోసగాడు.. మొదటి నుంచి అంతే: షోయబ్ అక్తర్

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ2025లో పాకిస్తాన్ వరుసగా రెండో ఓటమి చవిచూసింది. దీంతో తమ సెమీస్ అవకాశాలను పాక్ జట్టు సంక్లిష్టం చేసుకుంది. తొలి మ్యాచ్‌లో న్యూజిలాండ్ చేతిలో ఓటమి చవిచూసిన పాకిస్తాన్.. రెండో మ్యాచ్‌లో కూడా అదే ఫలితం పునరావృతమైంది. దుబాయ్ వేదికగా భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో పాక్ పరాజయం పాలైంది. బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ విఫలమైన ఆతిథ్య జట్టు ఈ ఘోర ఓటమిని మూటకట్టుకుంది. దీంతో పాక్ జట్టు ఇంటాబయట విమర్శలు ఎదుర్కొంటుంది. తాజాగా ఈ జాబితాలోకి పాకిస్తాన్ ఫాస్ట్ బౌలింగ్ దిగ్గజం షోయబ్ అక్తర్ చేరాడు. ఈ మ్యాచ్‌లో విఫలమైన పాక్ స్టార్ ప్లేయర్ బాబర్ ఆజం(Babar Azam)పై విమర్శలు గుప్పించాడు. ఓపెనర్‌గా బరిలోకి దిగిన బాబర్ ఆట తీరును అక్తర్ తప్పుబట్టాడు. "మనం ఎప్పుడూ బాబర్ ఆజంను విరాట్ కోహ్లితో పోలుస్తాం. విరాట్‌కు బాబర్‌కు చాలా వ్యత్యాసం ఉంది. కోహ్లి.. సచిన్ టెండూల్కర్‌ను రోల్‌మోడల్‌గా తీసుకుని తన కెరీర్‌ను ప్రారంభించాడు. టెండ్కూలర్ అంతర్జాతీయ క్రికెట్‌లో 100 సెంచరీలు చేశాడు. విరాట్ ఇప్పుడు అతడి వారసత్వాన్ని పొందేందుకు ప్రయత్నిస్తున్నాడు. సచిన్ సెంచరీలకు చేరువతున్నాడు. కానీ బాబర్ ఆజంకు ఎవరూ ఆదర్శం లేరు. అతడి ఆలోచిన విధానం సరిగ్గాలేదు. అనవసరమైన విషయాలపై దృష్టి పెట్టి తన రిథమ్‌ను కోల్పోయాడు. బాబర్ ఆజం ఒక మోసగాడు. అతడు కెరీర్ ఆరంభం నుంచి సెల్ఫిష్‌గా ఉన్నాడు. పాకిస్థాన్ క్రికెట్ జట్టు గురించి మాట్లాడేందుకు నాకు ఆసక్తి లేదు" అని అక్తర్ ఓ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నాడు. కాగా ఈ మ్యాచ్‌లో బాబర్ ఆజం 23 పరుగులు చేసి ఔటయ్యాడు.

**విరాట్ కోహ్లి సూపర్ సెంచరీ..**

కాగా ఈ మ్యాచ్‌లో 242 పరుగుల టార్గెట్‌ను భారత్ కేవలం నాలుగు వికెట్లు మాత్రమే కోల్పోయి 42.3 ఓవర్లలో ఛేధించింది. భారత బ్యాటర్లలో విరాట్ కోహ్లి అజేయ సెంచరీతో చెలరేగాడు. కోహ్లి 111 బంతుల్లో 7 ఫోర్లతో సరిగ్గా 100 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. అతడితో పాటు శ్రేయస్ అయ్యర్(67 బంతుల్లో 5 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 56), శుబ్‌మన్ గిల్(46) పరుగులతో రాణించారు. పాక్ బౌలర్లలో షాహీన్ అఫ్రిది రెండు వికెట్లు పడగొట్టగా.. అర్బర్ అహ్మాద్, కుష్దిల్ షా తలా రెండు వికెట్లు వికెట్ సాధించారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com